# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com

విజయవాడ | సంపుటి:13 | సంచిక:222 | గురువారం | జనవరి 09, 2025 | ఎడిటర్:రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు :8 | వెల:రూ 5/-

published from Vijayawada,Kakinada, Ananthapuramu, Kadapa, Eluru Circulated at AndhraPradesh & Telangana





కేంద్ర కరువు బృందం ముందు రైతులు ఏ కరువు



-సంక్రాంతి వచ్చేస్తుంది...
సంచులతోనే లేపేస్తున్నారు...
-వీరు సంచులు నింపితే చాలు
..వారు సంచులెత్తుకెళ్ల వచ్చు...
-సీజ్ ద షిప్ అన్నారు..అంతా
తూచ్ అయ్యింది...
-అక్రమంచేస్తే
తొక్కేస్తామన్నారు...ఇక్కడేమో
తీసుకెళ్తూనే ఉన్నారు..
-ఖబడ్దార్ అన్నారు... కాసుల కోసం
కక్కుర్తి పడుతూనే ఉన్నారు..
-కూటమి ప్రభుత్వం లో కుట్రలకు
నో అన్నారు..
-క్వింటా లకు క్వింటాలు కొట్టేస్తునే
ఉన్నారు..
-సమాచారం ఇస్తేనే సీజ్
చేస్తారట...
-జిల్లా అధికారికి జేబులు నిండితే
చాలను కొంటా ..
-ఏ ఎస్ ఓకి ఎంత
వాటాలున్నాయో..
-ఎన్ఫోర్స్మెంట్ డీటీ,ఆర్ఐకి
ఆమ్యామ్య లున్నట్లే గా..

# బరితెగించిన బెజవాడ బియ్యం మాఫియా..

## అదురు బెదురు లేకుండా అడ్డగోలుగా అక్రమ రవాణా ..

-పేరు పేదలది పంచుకునేది పెద్దలు... గద్దలా...
-పేదవాడి పొట్టగొట్టడం పాపం కాదా...
-పేదల రక్తం త్రాగుతూ వారి కడుపు లే
మారుస్తారా..
-సిగ్గు ఎగ్గులేని యంత్రాంగం తో ఇంకెన్ని
చూడలో..
-గోడౌన్ నుంచే నేరుగా తరలిస్తుంటే...
-పోలీసులు పట్టుకుంటే నే ...లేదంటే తరలిపో
యినట్లేగా...
-రెవెన్యూ వ్యవస్థ వారి రెవెన్యూ కోసమేనా...

(రామమోహన్ రెడ్డి, సంపాదకులు)

నవ్విపోదురు గాక నాకేల సిగ్గు అన్న చందంగా వృత్తి లో న్యాయపరమైన విధానాలను పాటించి పది మంది పేద వారి కి పండుగ పూట పట్టే డన్నము తినడానికి ప్రభుత్వం ఇ స్తున్న పేదల బియ్యం పందికొక్కుల్లాగా పరాయి ప్రాంతా ల కు తరలిస్తూ పేదల పొట్ట కుడుతుంటే చేష్టలుడిగిన

మిగతా 2లో

# ప్రాణాలుపోసేవారిని డాక్టర్ అంటారు

## పిండాలను కరిగించే వారిని ఏమంటారు..



-పొట్టలోనే బిడ్డను చంపేసిన ఆర్ ఎంపీ ఎవరు..?
-ప్రకృతి ఇచ్చిన అక్క.. పోరంబోకు తమ్ముడి కోసం పాట్లు
-పాడు పని చేసి పూసుపోని మాటలు చెబుతుంటే...
-ఆ పోరం బోకు పాపాలలో ఈ ప్రకృతి అక్క కు వాటాలున్నయా...
-పచ్చని సంసారాల్లో పుండు పేట్టేది ఇందుకేనా ..
-పది లక్షల బేరం లో ఈమె పాత్రేమిటీ..
-పచ్చని మనసులో పుండు బెట్టి చిలక పలకులు పలుకుతుంటే ..
-ఇన్ని పాపాలు చేసే ఆ పోరంబోకు పైకి పోయాడా..
-ఈ పోరంబోకు కు కూడా పరువు ఉంటుందా..
-ఇవన్నీ చూస్తుంటే పరువుకే పరువు పోదా...
-ఏమిటీ ప్రకృతి అక్క ..పోరంబోకు తమ్ముడి పరువు గోల...

వచ్చే సంచికలో మీ ప్రజా భూమిలో



## రాష్ట్ర ప్రజల ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తాం

2

విశాఖ నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని మోదీ

## ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు మోదీ

2

-మోదీ రాకతో రూ.2.08 లక్షల కోట్ల పనులకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్న సీఎం చంద్రబాబు





## మోదీ రాకతో రూ.2.10 లక్షల కోట్ల పెట్టుబడులు

- 7.5 లక్షల మందికి ఉపాధి
-సదుద్దేశం, సదాశయం ఉంటేనే ఏదైనా సాధ్యమే
-డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

## పేదల చిరునవ్వు, మహిళల ఆశాదీపం 'నమో': నారా లోకేశ్



-వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి మోదీ ఆక్సిజన్ అందించారు
- నమో స్ఫూర్తితో ఏపీలో సీబీఎన్ 2047 విజన్ తయారుచేశారు :మంత్రి లోకేశ్

2



## జనవరి 26 లోపు ఇంటర్ సంస్కరణలపై సలహాలు, సూచనలు అందించాలి

10 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడిన అంశం
ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ ఫస్టియర్ పరీక్షల నిర్వహణ విధానాన్ని పరిశీలిస్తాం
చాలా ఏళ్లుగా ఇంటర్ విద్యలో సంస్కరణలు జరగలేదు
విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకే ఈ నిర్ణయం .. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా



## విశాఖలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ రోడ్ షో

ప్రధాని మోదీకి స్వాగతం పలికిన గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ నేతలు.. సిరిపురం కూడలి నుంచి ప్రధాని మోదీ రోడ్ షో

## ఇకపై కార్యకర్తలను గొప్పగా చూస్తాం

-పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం
-మీపై అన్యాయాలు చేసిన వారిని ఉపేక్షించం
-వారిని చట్టం ముందు నిలబెడతాం
-మనం చెడిపోయిన మీడియాతో యుద్ధం చేస్తున్నాం
-సోషల్ మీడియాను బలమైన ఆయుధంగా ఉపయోగించాలి
-ప్రతి సమస్య మీద సోషల్ మీడియాలో చంద్రబాబును నిలదీయాలి
-పార్టీ శ్రేణులకు వైయస్.జగన్ దిశా నిర్దేశం

2



ప్రజాభూమి

## 10న కర్నూలు జిల్లా పర్యటనకు మంత్రి నారా లోకేష్

ప్రజాభూమిప్రతినిధి,కర్నూలు :-

ఈనెల 10వ తేదీన కర్నూలు జిల్లా పర్యటనకు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ మంత్రి నారా లోకేష్ రానున్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ మంత్రి నారా లోకేష్ రా.9 గం.లకు అనంతపురం నుండి రోడ్డు మార్గాన బయలుదేరి రా.11 గం.లకు కర్నూలు రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం చేరుకొని బస చేస్తారు.ఉ.9గం.లకు రోడ్డు మార్గాన బయలుదేరి నగరంలోని పలు కళాశాలలను పరిశీలిస్తారు. మ.12 గం.ల నుండి మ.1 గం.ల వరకు ఎస్‌ఏపి గ్రౌండ్స్ చేరుకొని రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్ కుమార్తె రిసెప్షన్ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం మ.1 గం.లకు ఎస్‌ఏపీ గ్రౌండ్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మ.1:30 గం.లకు కర్నూలు విమానాశ్రయం నుండి బయలుదేరి వెళ్తారు.

# బరితెగించిన బెజవాడ బియ్యం మాఫియా..

మొదటిపేజీ తరువాయి

చందాన తమ అవినీతి సొమ్ముతో తమ పొట్టలు నింపుకుంటూ పేదల నోటికాడి కూడు తీస్తుంటే చూస్తూ ఉంటున్న ఈ అధికార వ్యవస్థ ను ఏమని నిందించాలి ఎలా నిగ్గదీసి అడగాలో ఆ నీతి లేని అధికారులే ఆలోచన చేయాలి మరి. బరితెగించిన బియ్యం మాఫియా బెజవాడ లో చేస్తున్న స్వైరవిహారం చూస్తుంటే పౌర సరఫరాల శాఖ ఉందా లేక పతనావస్థకు చేరుకుందా అన్నది అర్థం కావడం లేదు.ప్రభుత్వాలు మారినా ప్రతి సారీ చేస్తున్న ప్రకటనలు ఆ పూటకు మాత్రమే పబ్బం గడుపుకుని ఉంటున్నాయే తప్ప ఆచరణలో చిత్తశుద్ధి కనిపించక పోవడం బాధాకరం. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం పేద ప్రజల జీవన స్థితి గతులను చిన్నాభిన్నం చేస్తున్నాయి. పేద ప్రజలకు అందవలసిన రేషన్ బియ్యం పక్కదారి పడుతుంటే పట్టించుకున్న నాధుడే కరువయ్యారంటే ఈ అవినీతి అధికారులు తీరు ఎలా ఉందో అర్ధవుతుంది. నిన్న జరిగిన ఉదంతం ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం సిగ్గుతో తలదించుకునేలా ఉందని చెప్పుకత ప్పదం లేదు.కారణం ఉపముఖ్యమంత్రి సీజ్ ద షిప్ అన్నా పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ని అర్ధర్లు వేసినా అవి అప్పటికప్పుడు వినసొంపుగా ఉంటున్నాయే తప్ప ఆచరణలో అనువంత కూడా కనిపించలేని స్థితిలో అధికార యంత్రాంగం ఉంది. ఇలా కాక పోతే బెజవాడ బియ్యం మాఫియా బరితెగించి నగర శివారు ప్రాంతం జక్కంపూడి కాలనీ లో ప్రభుత్వం ఏ విధంగా గన్నీ బ్యాగుల తో గోడౌన్ లో బియ్యం బస్తాలు దింపిందో ఆ బస్తాలు కనీసం గన్నీ బ్యాగును కూడా తొలగించకుండా బైటి ప్రాంతాలకు తరలిస్తున్నారంటే వీరి బరితెగింపుకు బాధ్యత సంబంధిత అధికారులదికాదా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రేషన్ మాఫియా విసిరే కాసులతో వీరి సంచులు నింపుకుని మౌనంగా ఉంటే వారు ఏ సంచులనైన ఎక్కడికయిన తరలించే చనువు తీసుకుంటున్నారు.ప్రజల రక్తాన్ని చెమట గా మార్చి తినే ఉప్పు పప్పు నుండి వచ్చే పన్నుల రూపంలో ప్రభుత్వం రాబట్టి ప్రభుత్వ సంక్షేమం కోసం పని చేస్తున్నట్లు నటిస్తున్న ఈ అవినీతి అధికారులకు జీతాలు చెల్లించి ఏసీ గదుల్లో కూర్చో బెట్టినా కనీస వృత్తి ధర్మాన్ని విస్మరించి కాసుల కోసం కక్కుర్తి పడి పేద వారి పొట్ట కొట్టే ప్రయత్నం లో ఏమాత్రం పట్టింపు లేకుండా ప్రవర్తిస్తున్న ఈ అధికార వ్యవస్థ ను ఏ ప్రభుత్వం వచ్చినా ప్రకటనలు చేసుకుంటూ పబ్బం గడుపుకోవాల్సిందే తప్ప ప్రజలే చివరికి పరిస్థితి ని బట్టి తమ జీవనం కోసం ప్రాకులడుకోవాల్సిందేనన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గత ప్రభుత్వం లో పేదల బియ్యాన్ని గద్దలు ఎత్తుకెళ్లాయని కూటమి ప్రభుత్వం లో అక్రమం అంటే అణిచి వేస్తామని అన్న మాటలు అవినీతి అధికారులకు అస్సలు పట్టకపోవడం అత్యంత బాధాకరం.ఇలాంటప్పుడు జిల్లా పౌర సరఫరాల శాఖ ప్రధాన అధికారి ,కింది స్థాయి అధికారులు కళ్ళకు గంతలు కట్టుకున్నారా లేక రేషన్ మాఫియా విదిల్చే కాసులకు కళ్ళు బైర్లు కమ్మి ఈ అక్రమాలు చూడలేని స్థితిలో ఉంటున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మళ్లీ రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయదానికి రెవెన్యూ లోనే ఎన్ఫోర్స్ మెంట్ ఒకటి ఉన్నా పాపం వారు ఎవరిని ఫోర్స్ చేయకుండా సమాచారం ఇచ్చి పట్టిస్తే ఫోటోలకు ఫోజులిచ్చి పెద్ద ఘనకార్యం చేసినట్టు ప్రచారం చేసుకుని పబ్బం గడుపుకుని ఉంటున్నారే తప్ప విమర్శలు లేకపోలేదు. నిన్న జరిగిన టు టు టౌన్ పోలీసులకు రాబడిన సమాచారం మేరకు పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూస్తే బెజవాడ బియ్యం మాఫియా తీరు ఈ అవినీతి అధికారుల తీరు అర్ధమవుతుంది.

# రాష్ట్ర ప్రజల ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తాం: ప్రధాని మోదీ

ప్రజాభూమిప్రతినిధి,విశాఖ:-

విశాఖలో 2 లక్షల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. విశాఖ బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని మోదీ వర్చువల్‌గా పలు ప్రాజెక్టులకు, అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. రాష్ట్ర ప్రజల కల, విభజన హామీల్లో కీలకమైన విశాఖ రైల్వేజోన్‌తో పాటు పారిశ్రామిక హబ్, గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్కులకు శంకుస్థాపన చేశారు. సభా వేదిక పైనుంచి అభివృద్ధి పనులకు ప్రారంభించారు. రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు : అనకాపల్లి జిల్లా పూడిమడకలో లక్షా 85 వేల కోట్ల పెట్టుబడితో 1200 ఎకరాల్లో నిర్మించనున్న ఎన్టీపీసీ ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులకు ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 25 వేల మందికి ఉపాధి లభించనుంది.

నక్కపల్లిలో 2 వేల ఎకరాల్లో 1867 కోట్లతో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కుకు ప్రధాని శంకుస్థాపన చేశారు. దీనివల్ల 10 నుంచి 14 వేల కోట్ల పెట్టుబడులతోపాటు సుమారు 28 వేల మందికి ఉపాధి లభించనుంది. చెన్నై- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా తిరుపతి జిల్లాలో క్రిస్ సిటీకి వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**17 రోడ్ల ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన :** రాష్ట్రవ్యాప్తంగా 17 రోడ్ల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. 242 కోట్లతో ఆదోని బైపాస్, 245 కోట్లతో నిర్మించనున్న దోర్నాల - కుంట జంక్షన్, 601 కోట్లతో నిర్మించనున్న సంగమేశ్వరం- నల్లకాలువ, వెలుగోడు- నంద్యాల రోడ్ల విస్తరణ పనులకు ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. చిలకలూరిపేటలో 6 లేన్ల బైపాస్‌ను జాతికి అంకితం చేశారు.

వీటితోపాటు రైల్వే ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. గుంటూరు-బీబీనగర్, గుత్తి-పెండేకల్లు రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు శంకుస్థాపన చేశారు.

# ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు మోదీ

ప్రజాభూమిప్రతినిధి,విశాఖ:-

మోదీ రాకతో రాష్ట్రానికి రూ.2.08 లక్షల కోట్ల పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విశాఖ వాసుల చిరకాల వాంఛ రైల్వే జోన్, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు వస్తోందని తెలిపారు. రూ.2.08 లక్షల కోట్లతో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నామని అన్నారు. విశాఖ బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు.ముందుగా ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. రాష్ట్రాభివృద్ధికి ఎప్పుడూ అండగా ఉన్న పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సాహం, అభిమానం చూపిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మోదీ రోడ్ షో బ్రహ్మాండంగా జరిగిందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు మోదీ అని సీఎం కొనియాడారు.ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఈసారి మనం గెలిచామని, ఇదే కాంబినేషన్ భవిష్యత్తులోనూ ఉంటుందని స్పష్టం చేశారు. ఢిల్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలుస్తుందని, రాసిపెట్టుకోండంటూ ధీమా వ్యక్తం చేశారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోదీ కృషి చేస్తున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలన మోదీ నినాదాలు అని అన్నారు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చేందుకు మేకిన్ ఇండియా తెచ్చారని గుర్తు చేశారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, గతిశక్తి పథకాలు తెచ్చారని తెలిపారు.రైతులకు అండగా ఉండేందుకు పీఎం ఫసల్ బీమా యోజన కొనసాగిస్తున్నారని, సూర్యఘర్, కుసుమ్ ద్వారా సౌరవిద్యుత్‌ను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. మోదీ కార్యక్రమాల వల్ల దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందని, 2047 నాటికి ప్రపంచంలోనే మొదటి లేదా రెండో స్థానం లో ఉంటామని అభిప్రాయపడ్డారు. విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామన్న సీఎం, కేంద్రం సాయంతో నిలదొక్కుకున్నామని, ముందుకెళ్తున్నామని చెప్పారు. సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలుచేసే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. కేంద్రం అండతో రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయని, రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా విశాఖ మారడం ఖాయమని స్పష్టం చేశారు. అరకు కాఫీని మోదీ బాగా ప్రచారం చేస్తున్నారని, ఆయనని స్ఫూర్తిగా తీసుకుని నిత్యం ముందుకెళ్తానని తెలిపారు. త్వరలో అమరావతికి రావాలని మోదీని కోరుతున్నామని చెప్పారు. నదుల అనుసంధానం తమ లక్ష్యమని, కేంద్రం సాయం కావాలని కోరారు.ఏ సమస్య చెప్పినా మోదీ వెంటనే అర్థం చేసుకుంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. వెంటనే పనులు జరిగేలా మోదీ చొరవ చూపిస్తారని అన్నారు. గతంలో ఏ ప్రధాని కూడా ఇంతగా చొరవ చూపించలేదని కొనియాడారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదని అన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. మనదేశానికి సరైన సమయంలో సరైన ప్రధాని ఉన్నారని ప్రశంసించారు. మోదీ సారథ్యం లో భారత్ ప్రగతిని ప్రపంచమంతా గమనిస్తోందని గుర్తు చేశారు. మంచి చేసే ప్రభుత్వానికి అండగా ఉంటేనే లక్ష్యాలు చేరుకోగలమన్న సీఎం, విధ్వంసాలు చేసే పార్టీలను దూరంగా ఉంచాలని పిలుపునిచ్చారు.

# మోదీ రాకతో రూ.2.10 లక్షల కోట్ల పెట్టుబడులు

ప్రజాభూమిప్రతినిధి,విశాఖ:-

భారత్‌ను గొప్ప దేశంగా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సదుద్దేశం, సదాశయం ఉంటేనే ఏదైనా సాధ్యమేనని పేర్కొన్నారు. మోదీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఏకతాటిపై నడిపిస్తున్నారని కొనియాడారు. విశాఖలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. ఆత్మనిర్భర్, స్వచ్ఛ భారత్ నినాదాలతో మోదీ ప్రజల మనసు గెలుచు కున్నారని పవన్ అన్నారు. నాలుగోసారి సీఎం పదవి చేపట్టిన గొప్ప నాయకుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం రావాలని ప్రజలు బలంగా కోరుకు న్నారని తెలిపారు. మోదీ రాకతో రాష్ట్రానికి రూ.2.10 లక్షల కోట్ల పెట్టు బడులు, 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తున్నాయని పవన్ వెల్లడించారు. పీఎం సడక్ యోజన ద్వారా గ్రామాలకు కూడా రోడ్లు వేస్తున్నామని అన్నారు.అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలనేది మోదీ ఆశయమన్న పవన్ కల్యాణ్, ఐదేళ్ల అవినీతి, అరాచక పాలనతో రాష్ట్రం అంధకారంలో కూరుకు పోయిందని తెలిపారు. అభివృద్ధి అంటే ఆంధ్రా అని చెప్పుకునేలా చంద్రబాబు కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో వెలుగులు నింపుతున్న మోదీకి అన్ని వేళలా అండగా ఉంటామని పవన్ కల్యాణ్ అన్నారు. బహిరంగ సభకు ముందు విశాఖకు వచ్చిన ప్రధాని మోదీకి గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబుతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు రోడ్‌షో నిర్వహించారు.

# పేదల చిరునవ్వు, మహిళల ఆశాదీపం 'నమో'

ప్రజాభూమిప్రతినిధి,విశాఖ:-

వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి మోదీ ఆక్సిజన్ అందించారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. సిటీ ఆఫ్ డెస్టినీకి వచ్చిన ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. విశాఖ బహిరంగ సభలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగించారు. హర్ ఘర్ తిరంగా, ఎక్కడ చూసినా నమో నినాదాలే అని లోకేశ్ వ్యాఖ్యానించారు. పేదల చిరునవ్వు, మహిళల ఆశాదీపం నమో (నరేంద్ర మోదీ) అని తెలిపారు. 2047 నాటికి దేశాన్ని అగ్రగామిగా మార్చేందుకు మోదీ కృషి చేస్తున్నారని లోకేశ్ అన్నారు. నమో స్ఫూర్తితో ఏపీలో సీబీఎన్ 2047 విజన్ తయారు చేశారని వెల్లడించారు.

హైదరా బాద్ వెళ్లి చూస్తే సీబీఎన్ విజన్ ఏంటో అర్థం అవుతుందన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి మోదీ ఆక్సిజన్ అందించారని కొనియాడారు. సమస్యలున్నా ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకు సీబీఎన్ కృషి చేస్తున్నార ని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇవాళ నిలిచిపోయే రోజు అని, రాష్ట్ర దశ, దిశ మార్చే కార్యక్రమాలకు ఇవాళ శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు.

నమో సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని, 2014-19 వరకు రాష్ట్రంలో అభివృద్ధిని గమనించాలని కోరారు. 2019-24 వరకు రాష్ట్రంలో జరిగిన విధ్వంసం తెలుసుకోవాలని లోకేశ్ అన్నారు.

# విశాఖలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ రోడ్ షో

ప్రజాభూమిప్రతినిధి,విశాఖ:-

ప్రధాని నరేంద్ర మోదీ విశాఖకు చేరుకున్నారు. విశాఖలో ప్రధాని మోదీకి గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం నుంచి సిరిపురం కూడలి వద్దకు ప్రధాని మోదీ చేరుకున్నారు. సిరిపురం కూడలి నుంచి ప్రధాని మోదీ రోడ్ షోలో పాల్గొన్నారు.

సిరిపురం కూడలి నుంచి ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానం వరకు ప్రధాని మోదీ రోడ్ షో కొనసాగింది.రోడ్ షోలో ప్రధాని మోదీతో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం పాల్గొన్నారు. రోడ్ షో అనంతరం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. మోదీని చూసేందుకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో రోడ్ షో జరిగే మార్గం రద్దీగా మారింది.విశాఖ ప్రజలకు అభివాదం చేస్తూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముందుకు కదిలారు. రోడ్ షోలో అడుగడుగునా పూలు జల్లుతూ మోదీకి విశాఖ ప్రజలు ఘనస్వాగతం పలికారు. సిరిపురం కూడలి నుంచి ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ వరకు రోడ్ షో జరిగింది.

## ఇకపై కార్యకర్తలను గొప్పగా చూస్తాం

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి:

వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాల నేతల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"అరు నెలలకే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత.ప్రభుత్వ వ్యతిరేకత రావడానికి కనీసం ఏడాదైనా పడుతుంది కదా అని అందరూ అనుకుంటారు. కానీ కేవలం ఆరు నెలలకే కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటోంది. ప్రతి ఇట్లో ఇదే చర్చ కొనసాగుతోంది. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో హామీలను 8 నెలల్లో పూర్తిగా గాలికొదిలేశారు.గతంలో మనం ఇచ్చిన పథకాలను రద్దు చేశారు. అవేవీ అమలు కావడం లేదు.కూటమి నేతలు ఎన్నికల్లో ప్రతి ఇంటికి వెళ్లి... చిన్నపిల్లల దగ్గర నుంచి నీకు రూ.15 వేలు అని మొదలు పెట్టి... అదే ఇంట్లో నుంచి ఆ పిల్లల తల్లులు బయటకు వస్తే నీకు రూ.18 వేలు, అదే ఇంట్లో ఆ తల్లుల అత్తలు, పెద్దమ్మలు బయటకు వస్తే నీకు రూ.48వేలు, అదే ఇంట్లో నుంచి 20 ఏళ్ల పిల్లాడు బయటకు వస్తే నీకు రూ.36వేలు అని, రైతు కండువా వేసుకుని వస్తే నీకు రూ.20వేలు అని అందరికీ హామీలు ఇస్తూ వచ్చారు. మనవాళ్లు చాలామంది శ్రేయోభిలాషులు వచ్చి.. చంద్రబాబులా హామీలు ఇవ్వాలని నాతో చెప్పారు. మనం కుటుంబమంతటికీ మంచి చేశాం.. వాళ్లు కుటుంబంలో ప్రతి మనిషికి ఇలా చెప్పుకుంటూ వస్తున్నారు. మనం కూడా చెబుదామన్నారు. కానీ ఆ రోజు మనం అబద్దాలు చెప్పలేదు. కారణం రాజకీయాల్లో ఉన్నప్పుడు వ్యక్తిత్వం, విశ్వసనీయ ఉండాలి. అలాంటి వారికే విలువ ఉంటుంది.పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.ఇప్పటికే ప్రతి గ్రామంలో కూడా పార్టీ నిర్మాణం ఉంది. దీన్ని వ్యవస్థీకృతంగా తీర్చిదిద్దాలి. ఈ సంక్రాంతి నాటికి పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల ఏర్పాట్లన్నీ కూడా పూర్తికావాలి. నేను కూడా జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి నుంచి జిల్లాల పర్యనటకు వస్తాను. అక్కడే నిద్ర చేస్తాను.ప్రతి వారం మూడు రోజులు మంగళ,బుధ, గురువారాల్లో ఒక పార్లమెంటులో విడిదిచేస్తాను. ప్రతిరోజూ రెండు నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలను కలుసుకుంటాను. మండలస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ పార్టీ బలోపేతం కావాలి.గ్రామస్థాయి కమిటీలు, బూత్ కమిటీలు ఇవన్నీకూడా బలోపేతం కావాలి. సోషల్ మీడియా బలమైన ఆయుధం.సోషల్‌మీడియాను బలమైన ఆయుధంగా ఉపయోగించుకోవాలి. మీరు నేను అందరం చర్చించి ఆ దిశగా అడగులు వేస్తాం. ఇవాళ మనం కేవలం చంద్రబాబుతో యుద్ధంచేయడం లేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి టీవీ5 లాంటి చెడిపోయి ఉన్న మీడియాతోనూ యుద్ధంచేస్తున్నాం. వీరిని ఎదుర్కోవాలంటే.. సోషల్‌మీడియా ద్వారానే సాధ్యం. మన దగ్గర నుంచి గ్రామస్థాయిలో ఉన్న ప్రతి కమిటీసభ్యుడు కూడా సోషల్‌మీడియాను వినియోగించుకోవాలి. ఫోన్ ఒక ఆయుధం కావాలి. ప్రతి ఒక్కరికీ వాట్సప్, ఫేస్ బుక్, ఇన్ స్టా, ఎక్స్, యూట్యూబ్ అకౌంట్ ఉండాలి. ప్రతి గ్రామంలో ప్రతి కమిటీ సభ్యుడు ఆ గ్రామంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ పోస్టు పెట్టాలి. పిల్లవాడు నా రూ.15 వేలు ఏమయ్యాయని ప్రశ్నించాలి. సూపర్ సిక్స్ ఏమైందని ప్రశ్నించాలి. తొలగిస్తున్న పెన్షన్లు మీద కూడా ప్రశ్నించాలి. ఇలా ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకురావాలి. అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించాలి. ఇచ్చిన హామీల అమలుకు పట్టుబట్టాలి. మూడు లక్షల పెన్షన్లు తొలగింపు.ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేనాటికి మన హయాంలో 66,34,742 పెన్షన్లు ఉంటే ఇవాళ చంద్రబాబు వచ్చిన తర్వాత డిసెంబరు నాటికి 62.81 లక్షలకు తగ్గిపోయాయి. అంటే 3.53 లక్షల పెన్షన్లు తగ్గించారు. ఇవి కాక ఇక దివ్యాంగులమీదకూడా బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తున్నారు. వీరి మీద చంద్రబాబు నాయుడు కమిటీ వేసి... వాళ్ల పెన్షన్లు తగ్గించే కార్యక్రమం మొదలు పెట్టారు. అంటే ఈ మార్చి నాటికి మరో 3 లక్షల పెన్షలు తగ్గించడమే వీరి ఉద్దేశం. ఇలా పెన్షన్లు, ఊర్లో ఉన్న ఆసుపత్రులు, కాలేజీలు అన్నింటి మీదా గ్రామంలో ఉన్న కార్యకర్త నుంచి నియోజకవర్గంలో ఉన్న నాయకుడు వరకు ప్రతి సమస్య మీద నిలదీయాలి. రాబోయే రోజుల్లో అందరం కలిసికట్టుగా అడుగులు వేసి చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం..మరోవైపు చాలా ముఖ్యమైన అంశం. కార్యకర్తల విషయంలో ఇంతవరకూ ఒకలా చూశాం.ఇకపై మరోలా చూస్తాం. వారిని గొప్పగా చూస్తాం.ఈ విషయంలో మనంకూడా కొంత నేర్చుకోవాల్సి ఉంది. వైయస్సార్సీపీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని భరోసా ఇస్తున్నాం.అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం. మీపై అన్యాయాలు చేసిన వారి పేర్లు గుర్తుపెట్టుకోండి. వారిని చట్టంముందు కచ్చితంగా నిలబెడతాం. ఎందుకంటే రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. వీళ్లే కొడుతున్నారు, మరలా అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఒక మనిషిని పదిచోట్ల తిప్పుతున్నారు. ఇవన్నీ కళ్లెదుటే కనిపిస్తున్నాయి. కచ్చితంగా కార్యకర్తలకు అండగా ఉంటాన"ని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు

## జనవరి 26 లోపు ఇంటర్ సంస్కరణలపై సలహాలు, సూచనలు అందించాలి

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు మరియు భాగస్వామ్య పక్షాల నుంచి వచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా ఇంటర్మీడియేట్ విద్యలో సంస్కరణలు తీసుకురావాలని చూస్తున్నామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు.. ఇంటర్మీడియేట్ విద్యా మండలి ప్రతిపాదిత విద్యా సంస్కరణలపై బుధవారం తాడేపల్లిలోని ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కార్యదర్శి కృతికా శుక్లా మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో తీసుకువచ్చే సంస్కరణల ఫలితాలు 10 లక్షల మంది విద్యార్థుల జీవితాలకు సంబంధించిన విషయమని అందుకే విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు మరియు భాగస్వామ్య పక్షాల నుంచి వచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా నిర్ణయాలు ఉంటాయన్నారు. ఇందుకు జనవరి 26, 2025 లోపు వారి అభ్యంతరాలను, సూచనలను biereforms@ gmail.com మెయిల్ కు చేయాలని, ప్రతిపాదిత సంస్కరణల విధానాలు bieap.gov.in అనే వెబ్ సైట్ లో అందుబాటులో ఉంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మినహా దేశంలోని ఇతర రాష్ట్రాల బోర్డులు ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్ని నిర్వహించడం లేదన్నారు. అత్యధిక శాతం ఇంటర్ బోర్డులు, యూనివర్శిటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్ని మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. ప్రధానంగా విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకే ఈ నిర్ణయం ఉపయోగపడుతుంది భావిస్తున్నామన్నారు. చాలా ఏళ్లుగా ఇంటర్ విద్యలో సంస్కరణలు జరగలేదన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి అనుగుణంగా ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలు చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలోనే ఆయా కళాశాలలు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలను ఇంటర్నల్ గా నిర్వహిస్తాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్సీ సిలబస్ ను ప్రవేశ పెడుతున్నామన్నారు. మొదటి ఏడాది పరీక్షల్ని పరిగణలోకి తీసుకోవడం లేదని, ఆ మార్కుల్నే అర్హతగా పరిగణిస్తున్నారన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఇంటర్మీడియేట్ విద్య సిలబస్ లో గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి సంస్కరణలు జరగలేదన్నారు. అందుకే 4 విధాలుగా వాటిని చేయాలని చూస్తున్నామని అందులో ప్రతిపాదిత సిలబస్ సవరణ, నూతన సబ్జెక్టు కాంబినేషన్ల ప్రతిపాదన, పరీక్షల్లో మార్కుల కేటాయింపు విధానంలో, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం పరీక్షలపై నిర్ణయం అనే నాలుగు అంశాలు ఉన్నాయన్నారు. గతంలో చేపట్టబడిన సవరణలు సైన్స్ సబ్జెక్టులకు ఫస్ట్ ఇయర్ కు 2012-13లో, సెకండ్ ఇయర్ కు 2013-14 లో, ఆర్ట్స్ సబ్జెక్టులకు 2014-15లో, సెకండ్ ఇయర్ కు 2015-16 లో, లాంగ్వేజెస్ కు 2018-19లో, సెకండ్ ఇయర్ కు 2019-20 లో జరిగినట్లు తెలిపారు. పాఠశాల విద్యా శాఖ 2024-25 విద్యా సంవత్సరం నుండి 10 వ తరగతిలో NCERT పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టారని తదనుగుణంగా 2025-26 విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరంలో విద్యాభ్యాసన ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సజావుగా సాగడానికి NCERT పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన NEET & JEE సిలబస్లతో సారూప్యత సాధించడానికి కూడా ప్రస్తుతం అమల్లో ఉన్న సిలబస్ ను సవరించవలసిన అవసరం ఏర్పడుతుందన్నారు. దేశవ్యాప్తంగా 15 కు పైగా రాష్ట్రాల్లో ఇంటర్ విద్యలో NCERT పాఠ్య పుస్తకాలను ప్రవేశపెట్టాయన్నారు. విద్యా రంగంలో విశేష అనుభవం కల్గిన విశ్వవిద్యాలయ ఆచార్యులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు మరియు జూనియర్ కళాశాల అధ్యాపకులతో ప్రతి సబ్జెక్టుకు ఒక ఎక్స్ పర్ట్ కమిటీ చొప్పున మొత్తం 14 కమిటీలను ఏర్పాటు చేసి వారి సిఫార్సుల ప్రకారం మార్పులకు ప్రతిపాదించామన్నారు. సైన్స్ గ్రూపుల్లో ఉమ్మడి ఏపీలో చివరి సారి సిలబస్ సవరణలు జరిగాయన్నారు. దేశ వ్యాప్తంగా ఇంటర్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో మార్పులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్ని బోర్డు నిర్ణయించిన సిలబస్, బ్లూ ప్రింట్ ఆధారంగా కాలేజీల్లో అంతర్గతంగా నిర్వహిస్తారన్నారు. ఇంటర్ సెకండియర్ పరీక్షల్ని సెకండియర్ సిలబస్తో మాత్రమే నిర్వహించి ఫలితాలను విడుదల చేస్తారన్నారు..ఈ ప్రతిపాదనలపై సలహాలు సూచనల్ని 2025 జనవరి 26 లోపు ఇంటర్ బోర్డుకు తెలియచేయాల్సి ఉంటుం దన్నారు. ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యావేత్తలు సూచనలు చేయాల్సిందిగా ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా వారిని కోరారు. సవరించబడిన సిలబస్ ను విద్యా మండలి పోర్టల్ bieap.gov.in ఉంచామని అదేవిధంగా biereforms@gmail.com మెయిల్ కు తమ అభిప్రాయాలను పంపాల్సిందిగా కోరుతున్నామన్నారు. కొత్త ముసాయిదా ప్రకారం ఇంటర్ పరీక్షల విధానంలో కూడా సమూల మార్పులు చోటుచేసుకోనున్నాయన్నారు. ప్రతి సబ్జెక్టులో ఇంటర్నల్ మరియు ప్రాక్టికల్స్ తప్పనిసరన్నారు. ఇంటర్ బోర్డు పరీక్షల్లో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, ఖాళీలను పూరించడం, ఏకపద సమాధానాలు వంటి వాటికి మార్కుల్ని ప్రతిపాదించారన్నారు.

అక్టోబర్,



ప్రజాభూమి



## క్యాన్సర్ పై అధునాతన పరిశోధన చేసిన హేమలత కు వైవీయూ డాక్టరేట్

ప్రజాభూమి పులివెందుల టౌన్



పులివెందుల పట్టణానికి చెందిన రవి శేఖర్ కృష్ణమ్మల కుమార్తె హేమలతకు డాక్టరేట్ లభించింది. పర్యావరణ సహిత మానవ శరీరంలో ఔషధ సరఫరా, గాయాలను త్వరితగతిన నయం చేయడానికి నానోడ్రగ్ కనుగొన్న రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ డి. హేమలత కు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ను బుధవారం ప్రకటించింది. రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు కె.ఎస్.వి. కృష్ణారావు పర్యవేక్షణలో సింథసిస్ అండ్ క్యారెక్టర్జేషన్ ఆఫ్ పాలి శాఖరాయిడ్ బేస్డ్ హైడ్రోజెన్స్ ఫర్ కంట్రోల్ రిలీజ్ ఆఫ్ కీమోథెరపీ ఏజెంట్స్ అండ్ యాంటీ మైక్రోబియన్ అప్లికేషన్ అనే అంశంపై పరిశోధన చేసిన సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించారు. డి. హేమలత కు డాక్టరేట్ సర్టిఫికెట్ ను వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు జారీ చేశారు. ఈమె చేసిన సిద్ధాంత అంశంపై పలు ప్రఖ్యాత అంతర్జాతీయ పబ్లికేషన్స్ ఎల్సి వేర్, అమెరికన్ కెమికల్ సొసైటీ, స్ప్రింజర్ వంటి జర్నల్స్ లో పరిశోధనా పత్రాలు, బుక్ చాప్టర్స్ ప్రచురింపబడినవి. వైవీయూ రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్న డి.హేమలతను పరిశోధన గైడ్ డాక్టర్ కె ఎస్ వి కృష్ణారావును ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి పద్మ , ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, రసాయన శాస్త్ర అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు అభినందించారు. అలాగే పులివెందుల లో హేమలతకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## భార్య,కూతురుని చంపిన కసాయి అరెస్ట్

### వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ వి రమణ

ప్రజాభూమి, పులివెందుల



తొండూరు మండలం తేలూరు తుమ్మలపల్లె గ్రామం లో ఈనెల 6 న భార్యను, కూతురును చంపిన కేసులో తుమ్మల గంగాధర్ రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ వి.రమణ తెలిపారు. బుధవారం స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో రూరల్ సీఐ రమణ వివరాలను వెల్లడించారు. తుమ్మల గంగాధర్ రెడ్డి అనే వ్యక్తి రోజు మద్యం సేవించి భార్య శ్రీలక్ష్మి తో గొడవ పడుతూ, మద్యం తాగడానికి డబ్బులు అడగగా, అందుకు అతని భార్య నిరాకరించడంతో మీ అంతు చూస్తా అని భార్య శ్రీలక్ష్మిని,కూతురు గంగోత్రి లను బెదిరించి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భార్యతో గొడవపడి ఇంట్లో ఉన్న ఇనప పైపుతో శ్రీలక్ష్మి తలపై బాదుతుండగా ఇది గమనించిన గంగోత్రి అడ్డుపడడంతో గంగోత్రిని కూడా తలపై ఇనుప పైపుతో కొట్టడంతో వారు మంచంపై రక్త గాయాల తో పడిపోయారని సీఐ తెలిపారు. కొన ఊపిరితో ఉన్న ఇద్దరినీ మరలా మచ్చుగొత్తితో నరకడంతో వారు అక్కడికి కడిగే చనిపోయినట్లు సీఐ తెలిపా రు.ఈ కేసుకు సంబంధించి గంగాధర్ రెడ్డిని బుధ వారం టీ తుమ్మల పల్లె గ్రామ సమీపంలో అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశం లో ఏఎస్ఐ రామచంద్రయ్య పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## 13 నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాభూమి, పులివెందుల



ఈ నెల 13 వ తేది నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని శిల్పారామం పరిపాలన అధికారి బి. సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక శిల్పారామంలో, ఉలిమెల్ల లేక్ లో ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13, 14, 15 తేదీలలో ఈ కార్యక్రమాలు ఉంటాయని, ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ల చే ఆకర్షనీయమైన నృత్య ప్రదర్శ నలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పులివెందుల పట్టణ, పరిసర గ్రామీణ ప్రజలు ఈ సంక్రాంతి సంబరాలలో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు, వరప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలకు ఎంపిక్కెన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

### - ఉన్నత స్థాయికి చేరుకోవాలని డైరెక్టర్ ఆకాంక్ష

ప్రజాభూమి, వేంపల్లె



ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీకీ చెందిన 30 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక్కెనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా వెల్లడించారు. బుధవారం ట్రిపుల్ ఐటీ ఇంజనీరింగ్-4 చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్ నిర్వహించారు. యప్ టివి సంస్థ, ఎవరెస్ట్ ఇంజనీరింగ్, వే టూ న్యూస్ సంస్థలు పాల్గొన్నాయి. సెలెక్ట్ అయినా విధ్యార్థులకు యప్ టివి రూ. 5.5 లక్షలు, ఎవరెస్ట్ ఇంజనీరింగ్ రూ. 7 లక్షలు, వే టూ న్యూస్ రూ. 6 లక్షలు వార్షిక జీతాన్ని అందియనుంది. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ తో పాటు ఏఐ రవికుమార్, ప్లేస్మెంట్ అధికారి సుందర్ అభినందించారు. విధ్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని డైరెక్టర్ ఆకాంక్షించారు.

## సాయి చైతన్య స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో గల శ్రీ సాయి చైతన్య హై స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు సంక్రాంతివేడుకలకుముఖ్యఅతిథిగా మాజీ జెడ్పిటిసి , మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ శ్రీ కందుల రామి రెడ్డి పాల్గొన్నారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన వేడుకల్లో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు నృత్యాలు అతిధులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కందుల రామి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినివిద్యార్థులుచదువులోనూ అన్ని రంగాలలోనూ నైపుణ్యం సంపాదించాలని, చదివే చదవను అశ్రద్ధ చేయకుండా ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థిని విద్యార్థులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు .ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్.శ్రీనివాస్.కరస్పాండెంట్ చంద్రశేఖర్.. స్కూల్ స్టాప్ పిల్ల తల్లిదండ్రులు అదే సంఖ్యలో పాల్గొన్నారు

## మృతుల కుటుంబాలకు రామ్ చరణ్ పంపిన చెక్కులు అందజేత

ప్రజాభూమి శంఖవరం:





రాజమహేంద్రవరం శివారు న ఈనెల 4 వ తేదీన రామ్ చరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు హాజరై తిరిగి వెళుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాకినాడకు చెందిన ఎ మణికంఠ, టి చరణ్ ల కుటుంబ సభ్యులను బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు, రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి కత్తిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి), రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి, జిల్లా చిరంజీవి యువత ట్రెజరర్ గోదశి పుందరిష్ సినీ నటుడు రామ్ చరణ్ తరపున పరామర్శించారు. బాబి మాట్లాడుతూ ఇద్దరు అభిమానుల మృతి బాధాకరమని రామ్ చరణ్ సానుభూతి ప్రకటించారన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, మృతి చెందిన వారి కుటుంబాలకు రామ్ చరణ్ పంపిన ఒక్కొక్కరికి రూ 5 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతకాయల చిన్ని, గరగా రామ్, విజ్ఞాన శివ పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం

**- ప్రజల భూ హక్కుకు భరోసా కల్పించేలా సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**- అర్జీల పరిష్కారంలో అప్రమత్తతతో ఉండాలని అధికారులకు ఆదేశాలు**

**- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:



రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు జరిగాయని.. జిల్లాలో జరిగిన సదస్సుల్లో మొత్తం దాదాపు 4,813 పిటిషన్లు వచ్చాయని, ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టి ఇప్పటికే 1,819 అర్జీలను పరిష్కరించడం జరిగిందని.. గడువులోగా మిగిలిన వాటి పరిష్కారానికీ కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.
బుధవారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చివరి రోజు జరిగిన గూడూరుపాడు రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) స్టాల్ కార్యకలాపాలను పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వ భూముల రిజిస్టర్, రెవెన్యూ సదస్సుల మినిట్స్ రిజిస్టర్, ఎండోమెంట్ భూములు, అసైన్మెంట్ భూములు తదితర వివరాలను పరిశీలించారు. గ్రామస్తులు అందించిన పిటిషన్ల ఆన్లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. సదస్సుకు హాజరైన ప్రతిఒక్కరినీ పలకరించి సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత డిసెంబర్ 6న రెవెన్యూ సదస్సులు ప్రారంభమ య్యాయని.. బుధవారం వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సమాచార మిస్తూ సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. వీటిలో ఎఫ్ లైన్ (బౌండరీ డీమార్కేషన్), ఇనామ్స్, అసైన్మెంట్ ల్యాండ్స్, భూ సేకరణ, రీసర్వే, ఆక్రమణలు, 22ఏ తదితరాలకు సంబంధించిన పిటిషన్లు వచ్చాయన్నారు. భూ హక్కుకు భరోసా కల్పిస్తూ భూ సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం జరుగుతోందన్నారు. భూ సమస్యలపై బాధితులు ప్రభుత్వం చుట్టూ తిరగడం కాదు.. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి సమస్య పరిష్కరించాలనే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సదస్సులను విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. ప్రజల వద్దకే ప్రభుత్వం వెళ్లి సమస్యలను తెలుసుకొని, పరిష్కరించే విధంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఎల్ఏలోగా సమస్యలను పరిష్కరిస్తున్నామని, అదేవిధంగా కుటుంబ తగాదాలతో కొన్ని, మరికొన్ని కోర్టుల పరిధిలో ఉన్నాయని వివరించారు. కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కారం కాకపోయినా ప్రత్యేక ప్రణాళికతో వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి:

భూ వివాదాలు లేని గ్రామాలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సదస్సులు నిర్వహించిందని.. వీఆర్వో, తహసీల్దార్, సర్వేయర్ తదితర క్షేత్రస్థాయి అధికారులు అర్జీల పరిష్కారంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. సదస్సులో భాగంగా గ్రామస్థులు కోరిన భూ రికార్డుల వివరాల పత్రాలను కలెక్టర్ లక్ష్మీశ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, గుంటుపల్లి సర్పంచ్ బి.కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

### పథకం యథాతథంగా కొనసాగేలా చూడాలి

### ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి డిమాండ్

ప్రజాభూమి పోరుమామిళ్ల:



ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు ఆరోగ్యశ్రీ లో మార్పు ఏ మాత్రం సరికాదుని హైబ్రిడ్ మోడల్తో ఇన్సూరెన్స్ కంపెనీలకే లాభంఅది నిరుపేద రోగులకు అత్యంత ఇబ్బందికరంప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే ఉద్యమిస్తాంవైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు.ప్రజారోగ్యం పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, నెట్వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించడంలో ఉదాసీనంగా వ్యవహరించడం తగదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తూ పేద ప్రజలు అనారోగ్యం పాలైతే మానవతా దృక్పథంతో ఆదుకోవాలే తప్ప ట్రస్ట్ మోడల్లో ఉన్న ఆరోగ్యశ్రీని హైబ్రిడ్ మోడల్లోకి మార్చడం తగదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని మార్చుకోకపోతే ప్రజల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు.అది సంక్షేమ పథకం కాదుపేదల ఆరోగ్యాన్ని కాపాడే సంజీవని లాంటి పథకం ఆరోగ్యశ్రీ. అనారోగ్యంతో బాధ పడుతూ, వైద్యం కోసం అప్పుల పాలవుతున్న పేదలను ఆదుకునేందుకు తెచ్చిన ఒక గొప్ప పథకంఆరోగ్యశ్రీ పథకాన్ని ఒక సంక్షేమ పథకంగా చూడలేం. దివంగత వైఎస్సార్ వ ా న వ త్ ్వ ం తో రూపొందించిన ఆ కార్యక్రమాన్ని ఆయన తనయుడు వైఎస్ జగన్ మరింత ముందుకు తీసుకెళ్లారు. తండ్రీ తనయులిద్దరూ రాష్ట్ర ప్రజల ఆరోగ్య బాధ్యత ప్రభుత్వానిదే అన్నట్లు భావించి, మానవతా దృక్పథంతో ఆలోచించి పని చేశారు.
ఆరోగ్యశ్రీలో జగన్ విప్లవాత్మక మార్పులు 2019లో వైయస్సార్సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యే నాటికి ఆరోగ్యశ్రీలో కేవలం 1,059 ప్రొసీజర్లనే అనుమతించారు. కానీ, జగన్ ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను 3257కు పెంచారు. 919 నెట్వర్క్ ఆస్పత్రులను 2300కు పెంచారు. రూ.1000 ఖర్చు దాటిన ప్రతి వైద్యాన్ని పథకంలో చేర్చారు. పథకంలో కవరేజ్ను రూ.25 లక్షల వరకు పెంచారు. పథకంలో అర్హతకు వార్షికాదాయ పరిమితిని రూ.5 లక్షలకు పెంచడంతో, రాష్ట్రంలోని దాదాపు 1.5 కోట్ల కుటుంబాల్లో 95 శాతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చాయి. ఇవన్నీ ఆరోగ్యశ్రీలో జగన్ తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులుకోవిడ్ను కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి దానికి సంబంధించి దాదాపు 10 ప్రొసీజర్లను పథకంలో అనుమతించిన గొప్ప మనసు జగన్ది 2019లో చంద్రబాబు దిగిపోతూ, ఆరోగ్యశ్రీ కింద నెట్వర్క్ ఆస్పత్రులకు రూ.632 కోట్లు బకాయి పెట్టిపోతే ఆ మొత్తం కూడా వైయస్సార్సీపీ ప్రభుత్వం చెల్లించింది.వైద్యం కోసం ఏ ఒక్క నిరుపేద కుటుంబం ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో, జగన్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆ స్థాయిలో తీర్చిదిద్ది అమలు చేశారు. 6 నెలల్లోనే ఆరోగ్యశ్రీ నిర్వీర్యం కానీ, టీడీపీ కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. నెట్వర్క్ ఆస్పత్రులకు ఏకంగా రూ.3 వేల కోట్లు బకాయి పెట్టడంతో, అవన్నీ వైద్యాన్ని నిలిపేశాయి. మరోవైపు హైబ్రిడ్ విధానంలో పథకాన్ని అమలు చేస్తామంటూ, ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే పని మొదలు పెట్టారు. ఇది నిరుపేద రోగులకు శాపంగా మారనుంది.
గత మా ప్రభుత్వంలో ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ ట్రస్టు కింద చేసిన ఖర్చు దాదాపు రూ.13,500 కోట్లు కాగా, 2014%-%19 మధ్య అందు కోసం టీడీపీ ప్రభుత్వం చేసిన ఖర్చు కేవలం రూ.5,100 కోట్లు మాత్రమే
హైబ్రిడ్ మోడల్తో ప్రజలకు నష్టం మా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 95 శాతం కుటుంబాలు ఆరోగ్యశ్రీ పథకం కిందికి రాగా, దాదాపు 90 శాతం కుటుంబాలకు ఆరోగ్యశ్రీ ట్రస్టు మోడల్ కింద సేవలందించడం జరిగింది.ప్రభుత్వం ఇలాగే ఉదాసీనంగా వ్యవహరిస్తే ప్రజల పక్షాన వైయస్సార్సీపీ ఉద్యమిస్తుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హెచ్చరించారు.

## అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టివేత

### -పట్టుబడిన ఐచర్ వాహనాన్ని వదిలేసినట్టు సమాచారం?

ప్రజాభూమి ,వేముల

వేముల మండల కేంద్రంలోని మీది పెంట్ల పంచాయతీలో ని మారుమూల గుట్ట లోని బక్కన్నగారి పల్లె గ్రామానికి చెందిన బి.వెంకట్ నాయక్ అరటి తోటలోనీ ప్యాక్ హౌస్ లో అక్రమంగా నిల్వ చేసి రవాణాకు సిద్ధం చేస్తుండగా 4800 కేజీల రేషన్ బియ్యాన్ని, ఒక ఐచర్ వాహనాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పట్టు బడ్డారు. సమాచారం రాక మునుపు ఇంకా పెద్ద మొత్తంలో రవాణా చేసినట్టు సమాచారం.బుక్కపట్నం మండలం గోపులాపురం తాండ కు చెందిన కె.లక్ష్మి ప్రసాద్ నాయక్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బియ్యాన్ని తమ ఏజెంట్ల ద్వారా పల్లెల నుంచి సేకరించి మీది పెంట్ల గ్రామ పొలంలో డంపింగ్ చేసి రవాణాకు సిద్ధం చేస్తుండగా పక్కా సమాచారంతో విజిలెన్స్ సిఐలు శివన్న,నారకుల నారాయణ,ఏవో బాల గంగాధర్ రెడ్డి, పులివెందుల ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసిల్దార్ సుధీర్ లు దాడి చేసి ఐచర్ వాహనాన్ని,పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అయితే రాత్రికి రాత్రే అక్రమ రేషన్ ముఠా అధికారులను మేనేజ్ చేసి పట్టుకున్న ఐచర్ వాహనాన్ని తప్పించి కేవలం రేషన్ బియ్యం పట్టుకున్నట్లు చూపారు.పేద ప్రజల పొట్ట నింపేందుకు ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్నాయి. అయితే రేషన్ షాపులో అందించే బియ్యం దొడ్డు రకం కావడంతో అక్రమ వ్యాపారులు, దళారులు పేదల దగ్గర తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేస్తు ఆ బియ్యాన్ని ఇతర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. బియ్యం అక్రమ దందా మూడు పువ్వులు,ఆరు కాయలు గా నియోజకవర్గస్థాయిలో కొనసాగుతుంది. పట్టుపడ్డ బియ్యాన్ని అధికారులు పులివెందులోని సివిల్ సప్లయర్స్ గౌడన్ కి తరలించారు.

## రిపోర్టర్ రమణ మృతి పై పలు అనుమానాలు ?

### ఫోన్ లో ఫోటోలు, వీడియోలు, రికార్డింగ్ లు మాయం

### ముమ్మాటికి హత్యే అంటున్న బంధువులు

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణానికి చెందిన వెంకటరమణ మృతిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నా రు. మంగళవారం తన నివాసంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడని ముందుగా కుటుంబ సభ్యులు తెలిపారు. అతని భార్య అనారోగ్యంతో పుట్టినింట్లోనూ ఉంటూ వైద్యం చేయించుకుంటూ ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.అయితే రమణ ఆత్మహత్య చేసుకోలేదని, హత్య చేసి ఉంటారని వారి బంధువులు ఆరోపిస్తున్నారు. రమణ మృతి చెందక ముందు కొందరు వ్యక్తులు కారులో వచ్చి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించారని చుట్టువక్కల వారు అంటున్నారు. అలాగే ఫ్యానుకు వేలాడుతున్న రమణను చుట్టుపక్కల వారు వచ్చి క్రిందికి దించారని, అయినప్పటికీ మృతి చెందారని కానీ ఆ సమయంలో రమణ మొబైల్ లో వీడియో ఆన్ చేసినట్లు అనుమానం వచ్చి ఎవరు మొబైల్ ను తాకకుండా అలానే ఉంచారని కొందరు తెలిపారు. కానీ రమణ బంధువులు మొబైల్ కు ఉన్న లాక్ ను మృతి చెందిన రమణ ఫింగర్ ప్రింట్ తో తొలగించి మొబైల్ ను పరిశీలించినట్లు సమాచారం. అయితే మరల ఆ మొబైల్ ను పరిశీలించగా మొబైల్ లో ఉన్న ఫోటోలు, రికార్డింగ్, వీడియోలు లేకపోవడంతో అనుమానం మరింత పెరిగిందని కొందరి కుటుంబ సభ్యుల వాదన. రమణ కుటుంబ సభ్యులు తమకు ఏమి తెలియదంటూ చెబుతున్నారు. రమణ మరణ వార్త విన్న భార్య పులివెందుల చేరుకొని భర్త మృత దేహం వద్ద సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించింది. తన భర్త ఆత్మహత్య చేసుకునే పిరికివాడు కాదని ఎవరో హత్య చేసి ఉంటారని ఆమెతోపాటు ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ హత్యనా, ఆత్మ హత్యనా, అక్రమ సంబంధంతో మృతిచెందాడా అనేది పోలీసుల విచారణలో నిజ నిజాలు తెలియాల్సి ఉంది.వెంకటరమణ పోస్టుమార్టం నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని విష్ణు నారాయణ తెలిపారు. రమణ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పోస్ట్ మార్టం,ఫోన్ కాల్స్ ఆధారంగా, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## మత్స్య కారుల డిమాండ్ల సాధన కోసం ఎలాంటి ఉద్యమాలకైనా వెనకాడేదీ లేదు

### మాజీ జడ్పీటీసీ సభ్యుడు చొక్కా కాశీ

ప్రజా భూమి తుని



తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించిన తర్వాతే దివీస్ ముందడుగు వేయాలని, అలాకాకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే దివీస్ ప్రజావ్యతిరేకతను ఎదుర్కొనవలసి ఉంటుందని దివీస్ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు తొండంగి మాజీ ఎంపీటీసీ చొక్కా కాశీ హెచ్చరించారు.దివీస్ రసాయనిక వ్యర్థాల వల్ల సముద్రంలో మత్స్య సంపద నానశమవుతుందని మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు తో కలిసి ఆందోళన వ్యక్తం చేసారు.ఇప్పటికే అద్దరిపేట నుంచి చోడిపిల్లిపేట వరకూ గల మత్స్య కార గ్రామాల ప్రజలు దివీస్ పైపు లైన్ కువ్యతిరేకంగా పోరాడుతున్నామని, డిప్యూటీ తహశీల్దార్ ముందు చొక్కా కాశీ తమ గోడువినిపించారు.డిమాండ్లపై దివీస్ కు అల్టిమేటం ఇచ్చామని అయితే ఆ కంపెనీ నోరు విప్పడం లేదని చొక్కా అప్పారావు, చొక్కా కాశీ ఆరోపించారు .దివీస్ వల్ల ఉపాధి కోల్పోతున్నందున రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి నెలకి 15వేలు శాశ్వతంగా జీవన భృతి చెల్లించాలని అదే విధంగా ప్రతి కుటుంబానికి ఉద్యోగం కల్పించాలని, మండలంలోని ప్రతి మత్స్య కార కుటుంబానికి 10లక్షలు హెల్త్ కార్డులు ఇవ్వాలని చొక్కా అప్పారావు, చొక్కా కాశీ డిప్యూటీ తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.ఒంటిమామిడి సర్పంచ్ అంగులూరి సుధాకర్ మత్స్య కారులకు సంఘీభావం తెలిపారు

# పోషణ వాటికతో ఆరోగ్యం పుష్కలం

ప్రజాభూమి,టి.నరసాపురం.



మండల పరిధిలోని 12 అంగన్వాడీ కేంద్రాలు పోషక వాటికకు ఎంపికైనట్లు సూపర్వైజర్ ఎం లక్ష్మి తెలిపారు ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీ కేంద్రాల వద్ద పిల్లలకు గర్భవతులకు బాలింతల ఆరోగ్యం కోసం బలవర్ధకమైన ఆకుకూరలు తోటకూర గోంగూర చుక్కకూర పాలకూర మెంతికూర అలాగే కూరగాయలలో వంగ బెండ గోరుచిక్కుడు టమాట ఆనపకాయి మొదలగు కూరగాయలను సేంద్రీయ పద్ధతిలో పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు ఆరు సంవత్సరముల లోపు పిల్లలు బాలింతలు గర్భవతులకు రక్తహీనత నుండి రక్షించుటకు పౌష్టికాహారాలు ఎంత అవసరమని తెలిపారు ఈ సందర్భంగా మండలంలోని అల్లం చర్ల రాజుపాలెం లోని అంగన్వాడి కేంద్రంలో సాగుచేసిన కూరగాయలను ఆకుకూరలను గర్భవతులకు బాలింతలకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది ఏఎన్ఎం పాల్గొన్నారు

# శాసనసభ్యులు బాలరాజు పుట్టినరోజు వేడుకలకు తరలి వెళ్లిన జనసైనికులు

ప్రజాభూమి,టి.నరసాపురం.



పోలవరం శాసనసభ్యులు చిర్రీ బాలరాజు పుట్టినరోజు వేడుకలకు మండలం నుండి వేలాదిగా జన సైనికులు నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు మండలంలోని తిరుమల దేవి పేట పంచాయతీ నుండి ట్రాక్టర్లు మోటారు సైకిళ్లపై ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు మండల అధ్యక్షులు అడపా నాగరాజు ఆధ్వర్యంలో మోటారు సైకిళ్ళు కార్లతో ర్యాలీగా తరలి వెళ్లారు మండలంలో ఒక పండుగ వాతావరణం నెలకొంది తమ అభిమాన నాయకుడుకి అభినందనలు తెలియజేశారు

# స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులలో స్వీయ క్రమశిక్షణ

ప్రజాభూమి, ఏలూరు




ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలలో పి యం శ్రీ పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు స్కౌట్స్ మరియు గైడ్స్ ఉపాధ్యాయులగా హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల వేగవరంలో జరుగుతున్న శిక్షణలో భాగంగా ఐదవరోజున ప్రథమ చికిత్స, గుడారం నిర్మాణం, థ్రెడ్ లాషింగ్, మొదలైన వాటిపై డి.ప్రసాద్ ఏ యల్ టి , ఏలూరు జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు , గైడ్ వింగ్ కు, రేలంగి ధనలక్ష్మి ఏ యల్ టి , కె పద్మ ప్రి ఏ ఎల్ టి, సౌజన్య, శ్రీదేవి, చాంద్ బీబీ అడ్వాన్స్ అనువారు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ స్కౌట్స్ మరియు గైడ్స్ లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలలో యూనిట్ ప్రారంభించి విద్యార్థుల భవిష్యత్ కై పాటుపడాలని తద్వారా మంచి సమాజం ఏర్పడుతుందని, విద్యార్థులలో స్వీయ క్రమశిక్షణ, సమయపాలన, సహాయం చేయడం మొదలైన లక్షణాలు ఏర్పడతాయని తెలిపారు. ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాల స్పోర్ట్స్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

# పూర్తి స్థాయిలో ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలి

ప్రజాభూమి, వి.ఆర్.పురం



పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడంలో పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, మూడు సంవత్సరాల క్రితం కొంతమంది లబ్ధిదారులకి ఇవ్వడం, ప్రస్తుతం మూడు సంవత్సరాల తర్వాత కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా ఇంకా పెండింగ్ ఉంచటం సరైనది కాదని, నిర్వాసితులు ఏమైనా ప్రభుత్వాలను బిచ్చం అడుక్కుంటున్నారా, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మొదటి ముంపు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి పూర్తిస్థాయిలో ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెద్దమటపల్లి గ్రామంలో పంకు సత్తిబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికీ నిర్వాసితుల పరిస్థితి ఏమిటో అర్థం కాని స్థితికి పాలకులు తీసుకువెళ్లారని, పూర్తి ఆర్ అండ్ ఆర్ ఇవ్వలేదని నిర్వాసితుల భూముల ప్యాకేజీ నేటికీ చెల్లించకుండా కాలయాపన చేయడం భూమికి భూమి ఇవ్వకపోవడం నిర్వాసితులను పట్టించు కోకపోవడమేనని గుర్తు చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మొదటి ముంపు గ్రామాల్లో సర్వే లు ఇంటింటికీ నిర్వహిస్తామని, నిర్వాసితుల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారాలు చెల్లించి పునరావాసం కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు పులి సంతోష్ కుమార్, సోయం. చినబాబు, మండల నాయకులు కారం.సుందరయ్య, తుర్రం. బాబురావు, తోడం.రాజు, కదల.కొండారెడ్డి, కారం.సత్తిబాబు, గుండెపుడి.లక్ష్మణరావు, కమ్మచిచ్చు. సత్యనారాయణ, జల్లి. సత్యనారాయణ, శ్రీరపు. తాతబాబు, పొడియం. శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించిన ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రజాభూమి, వి.ఆర్.పురం



మండలంలోని శ్రీ సుందర సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరగనున్న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే తెప్పోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం ముక్కోటి ఉత్సవ కమిటీ సభ్యులు బృందం ఆలయ ప్రాకారాలను ఏర్పాట్లను పరిశీలించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారి ఆలయం నుండి ఉత్సవ మూర్తులను పల్లకిలో పవిత్ర గోదావరి నదిపై ఏర్పాటు చేసిన హంస వాహనం గల బోటుపై ఆశీనులు గావించనున్న నేపథ్యంలో వారు గోదావరి స్నాన ఘట్టాలను పరిశీలించారు. ఆలయ అధికారులతో మాట్లాడారు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా స్వామివారి తెప్పోత్సవంని జయప్రదం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ బృంద సభ్యులు పెందుర్తి సుదర్శన్ రావు, నాళ్లారపు సత్యనారాయణ, కోట్ల రామ్మోహన్ రెడ్డి,ఆలయ ధికారులు సాయిబాబు, జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, కార్యదర్శి బాగుల అంజన్ రావు, గ్రామస్తులు ఆత్మకూరు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం

ప్రజాభూమి,బుట్టాయిగూడెం.



అక్రమంగా ట్రాక్టర్లో తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నట్లుఅటవీ శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని కన్నాపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రేంజ్ ఆఫీసర్ స్థానిక విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం రాబడిన సమాచారం మేరకు అర్ధ రాత్రి ట్రాక్టర్ పై అక్రమంగా తరలిస్తున్న మారుజాతి కలపను ట్రాక్టర్ తో సహా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా కలపను తరలిస్తున్న వారిపై కేసును నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో రేంజ్ ఆఫీసర్ శివ రామ కృష్ణ తోపాటు డి ఆర్ ఓ జె. ప్రభాకర్, ఎఫ్ ఎస్ ఓ దినేష్, బీట్ ఆఫీసర్ రాంబాబు, నవ తేజ,రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హోరెత్తిన చిర్రి పుట్టిన రోజు వేడుక

**- అభిమానులతో కిక్కిరిసిన సభా ప్రాంగణం**

**- పాల్గొన్న అతిరథ మహారథులు**

**- సిబిఆర్ టోర్నీ లో గెలిచిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**

ప్రజా భూమి, జీలుగుమిల్లి



పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నివాసం వద్ద ఏర్పాటు చేసిన పుట్టిన రోజు వేడుక ఘనంగా జరిగింది.నియోజకవర్గం లో 7మండలాల నుండి కూటమి నాయకుల రాకతో సభా ప్రాంగణం కిక్కిరిసింది.మొదటగా వేద పండితుల వ్యాద వచనాలలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గా ఏజన్సీ టైగర్ కరాటం రాంబాబు,ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్,ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాస్ పాల్గొన్నారు.అభిమానులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చిర్రి చారిటబుల్ ట్రస్ట్ నీ ప్రారంభించారు.అలాగే జిల్లా కార్యదర్శి,ప్రధాన కార్యదర్శులు కరాటం సాయి, గడ్డమనగు రవికుమార్ ఆధ్వర్యంలో సిబిఆర్ న్యూస్ చానెల్ ను ఆవిష్కరించారు.సిబిఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీ లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసారు.ఈ కార్యక్రమం లో జీలుగుమిల్లి మండల అధ్యక్షులు పసుపులేటి రాము,బుట్టాయగూడెం మండల అధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు. పోలవరం మండల అధ్యక్షులు గుణపర్తి చిన్ని,కొయ్యలగూడెం తోట రవి, టి.నరసాపురం అడపా నాగరాజు,కుక్కునూరు మండల అధ్యక్షులు యుగంధర్,వేలేరుపాడు మండల అధ్యక్షులు ఆదినారాయణ నియోజకవర్గం లోని కూటమి నాయకులు కార్యకర్తలు,వీరమహిళలు పాల్గొని జయ ప్రదం చేసారు.

# పిసా కమిటీలకు న్యూ డెమోక్రసీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవం

**ప్రగతిశీల యువజన సంఘం నాయకుడు తగరం బాబురావు.**

ప్రజాభూమి, బుట్టాయగూడెం



మండలంలోని పలు గ్రామాల పిసా కమిటీలకు సిపిఐ(ఎంఎల్ ) న్యూడెమోక్రసీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రగతిశీల యువజన సంఘం నాయకుడు తగరం బాబురావు తెలిపారుబాబురావు తెలిపిన వివరాల ప్రకారం పెసా కమిటీలకు బుధవారం జరిగిన ఎన్నికల్లో ,కోర్సవారిగూడెం పంచాయతీలో నాలుగు పిసా కమిటీలలో కామవరం పీసా కమిటీకి కార్యదర్శి ఉపాధ్యక్షులుగా తెల్లం రమేష్, గుజ్జు రామారావు, కోర్స వారి గూడెం పెసా కమిటీకి కార్యదర్శి ఉపాధ్యక్షులుగా కారం వెంకటేష్, పూనెం నాగేశ్వరరావును,మోతుగూడెం గ్రామం పెసా కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షులుగా గోగుల చెన్నయ్య, గోగుల వెంకటరెడ్డి, వేపులపాడు పెసా కమిటీ కార్యదర్శి ఉపాధ్యక్షులుగా సోడెం వీరస్వామి, కాకి వెంకటేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బాబురావు తెలిపారు.రెడ్డి గణపవరం పంచాయతీ వెలుతురువారి గూడెం, వాడపల్లి కాలనీ పెసా కమిటీకి కార్యదర్శి ఉపాధ్యక్షులుగా గుజ్జు రమేష్ బాబు, కట్టం చిన్న మంగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

# ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకులు

## అభిమానులతో కిక్కిరిసిన సభా ప్రాంగణం

ప్రజా భూమి,వేలేరుపాడు



పోలవరం ఎమ్మెల్యే చిర్రి. బాలరాజు నివాసం వద్ద ఏర్పాటు చేసిన పుట్టిన రోజు వేడుక బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వెలేరుపాడు మండలం నుండి బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు ఓలేటి. నాగదుర్గ అనిల్ ( బాలకృష్ణ) ,బీజేపీ పార్టీ మండల ప్రధాన కార్య దర్శి సారె బాబ్జి, బీజేపీ కార్య కర్తలు ఎమ్మెల్యే చిర్రి. బాలరాజు కు మర్యాద పూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపటం జరిగినది. ఈ సందర్భంగా కార్యదర్శి సారే బాబ్జి మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి అన్ని రకాల ప్యాకేజీలు ఏ ఆటంకాలు లేకుండా అందించాల్సిన అవసరం యువ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పై ఎంతైనా ఉందన్నారు. ఇంకా గత ప్రభుత్వం పెట్టిన కొర్రీలు కారణంగా ఎంతోమంది నాన్ రెసిడెన్స్ పేరుతో ప్యాకేజీలకు దూర మయ్యారని ,వారందరికీ కూడా ప్యాకేజీలు ఇప్పించాలని ఆకాంక్షించారు. పునరావాసాల్లో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి మరల గోదావరి వరదలు వచ్చేనాటికి ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఈ సందర్భంగా బాబ్జి కోరారు.

## మున్సిపల్ టెండర్ల ఖరారులో జాప్యం...!!

**-గుత్తేదారుడి ఆవేదన**

ప్రజాభూమి, హిందూపురంటౌన్




హిందూపురం పురపాలక సంఘంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా ఆన్ లైన్ ద్వారా దక్కించుకున్న పనులకు సంబంధించి టెండర్ల ఖరారులో అధికారులు తీవ్ర జ్యాప్యం చేస్తున్నారని చిత్తూరు జిల్లాకు చెందిన గుత్తేదారుడు గోవర్ధన్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. గత సంవత్సరం హిందూపురం పురపాలక సంఘంలో రూ. 5 లక్షలు విలువ చేసే చెట్ల పంపిణీ కోసం ఆన్ లైన్ విధానంలో టెండర్ పిలవడం జరిగిందన్నారు. ఈ టెండర్ ఆన్ లైన్ లో దక్కించుకుని, నిబంధనల మేరకు ఈఎండి, ఏపీటీఎస్ చెల్లించి అగ్రిమెంట్ సైతం పూర్తి చేసుకున్నాను. చెట్లను పంపిణీ చేస్తానని అధికారులకు కోరుతున్నప్పటికీ ఒప్పుకోవడం లేదన్నారం. దీంతో పాటు రూ.16 లక్షలకు సంబంధించి చెత్త సేకరణ బండ్లు ( పుష్ కార్ట్స్) తో పాటు పారిశుధ్య విభాగానికి సంబంధించిన వివిధ పరికరాల కోసం ఆన్ లైన్ ద్వారా టెండర్ పిలిస్తే దీనిని సైతం తాను దక్కించుకున్నాను. అయితే ఈ పని విషయంలో అగ్రిమెంట్ చేసుకోవడానికి తిరుపతి నుంచి ఇక్కడికి పలుమార్లు వచ్చినప్పటికీ అగ్రిమెంట్ చేసుకోకుండా అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని మీడియా ముందు తన సమస్యను వివరించారు. అయితే ఈ విషయంపై మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను వివరణ కోరగా చిత్తూరు జిల్లాకు చెందిన గుత్తేదారుడు గోవర్ధన్ బాబు గతంలో హిందూపురం పురపాలక సంఘంలో పలు టెండర్లను దక్కించుకుని సకాలంలో దానికి సంబంధించిన మెటీరియల్ ను పంపిణీ చేయలేదన్నారు. దీంతోపాటు పారిశుధ్య కార్మికుల కోసం కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులతోపాటు జాకెట్, ఇతర పరికరాలు సరఫరా చేస్తామని టెండర్ దక్కించుకుని సంవత్సరాలు గడిచినప్పటికీ సరఫరా చేయలేదన్నారు. వీధి దీపాల నిర్వహణలో భాగంగా ఎల్ఈడి లైట్ ల మరమ్మత్తులకు సంబంధించిన మెటీరియల్ సైతం టెండర్ దక్కించుకుని సరఫరా చేయలేదన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని సకాలంలో గుత్తేదారుడు సరఫరా చేయడని, ప్రస్తుతం దక్కించుకున్న టెండర్లకు సంబంధించిన మెటీరియల్ సరఫరా చేస్తే మిగిలిన పనులను అగ్రిమెంట్ చేసి ఇస్తామని సూచించామని తెలిపారు.

# వర్షాలు సకాలంలో కురవక మా రైతులు సర్వం నష్టపోయారు

**-వేరుసెనగ, కంది, టమోటా, పప్పుశెనగ అన్ని పంటలకు నష్టం వాటిల్లింది**

**-కేంద్ర కరవు బృందానికి ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి**

ప్రజాభూమి, రాప్తాడు:



వర్షాలు సకాలంలో కురవక మా ప్రాంతంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని.. వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కేంద్ర కరవు బృందానికి విజ్ఞప్తి చేశారు. రాప్తాడు గ్రామ పరిధిలో బుధవారం సాయంత్రం ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం సభ్యులు అండర్ సెక్రెటరీ (ఐ.ఎఫ్.డి), %ణ/రా%రూరల్ డెవలప్మెంట్ జయంతి కనోజియా, హైదరాబాద్ డీటీఈ ఆఫ్ ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ డా.కె.పొన్నుసామి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరలు పర్యటించారు. ముందుగా రైతు కొండప్ప పొలంలో కరవు పరిస్థితిని పరిశీలించి.. జరిగిన పంట నష్టం గురించి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఎమ్మెల్యే సునీత అన్ని అంశాలను వివరించే ప్రయత్నం చేశారు. సీపీఐ నాయకులు కూడా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన పంట అయిన వేరుశెనగకు తీవ్ర వర్షాభావం వలన నష్టం వాటిల్లిందన్నారు. కీలకమైన సమయంలో 58రోజుల పాటు వర్షాలు రాలేదన్నారు. ఆ తర్వాత వర్షాలు వచ్చి పంట పచ్చగా మారినా లోపల విత్తనం లేకుండా పోయింది. కందిపంట కీలక దశలో ఉన్న సమయంలో వర్షాలు ఎక్కువై తెగుళ్ళ వ్యాపించి రైతులు తీవ్రంగా నష్టయారన్నారు. పప్పుశెనగ, టమోటా పంటది కూడా దాదాపు ఇదే పరిస్థితి అన్నారు. వర్షాల ఆధారంగా కరవు ప్రాంతాలు చూడవద్దని.. కీలకమైన సమయంలో వర్షాలు లేక పంటలు కోల్పోయారన్నారు. మరోవైపు ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి మండలాల్లో పంట నష్టం తీవ్రంగా ఉందని.. కానీ వాటిని కరవు మండలాలుగా ప్రకటించలేదన్నారు. వీటిని కరవు మండలాల జాబితాలో చేర్చాలన్నారు. మరోవైపు పీఏబిఆర్ ద్వారా రాప్తాడు, ధర్మవరం ప్రాంతాలకు సరిగా నీరందడం లేదన్నారు. వర్షాలు బాగా వచ్చి రిజర్వాయర్ లో నీరు ఉన్నా.. తమ ప్రాంతాల్లోని చెరువులకు నీరందించలేదన్నారు. ముఖ్యంగా రాప్తాడు నియోజక వర్గానికి ప్రతి సారి అన్యాయం జరుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ ఈసారైనా తమ ప్రాంతానికి పూర్తి స్థాయిలో నీరు వచ్చేలా చూడాలన్నారు. 2టీఎంసీలు అదనంగా నీరు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు అనంతపురం జిల్లా వంటి ప్రాంతంలో 20ఎకరాలు ఉన్నా.. ఆ రైతును ధనిక రైతుగా చూడలేమన్నారు. పైగా వారికొచ్చే నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకే ఈ ప్రాంతంలో 10ఎకరాలు ఉన్న రైతులకు కూడా డ్రిప్, స్ప్రింక్లర్లు 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. మరోవైపు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, రైతులు చెప్పిన అంశాలను సెంట్రల్ టీంకు వివరించామని..వారు కూడా పరిస్థితిని ప్రత్యక్షంగా చూశారన్నారు. రైతులను తగిన సాయం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేసిన అంశం మీద కలెక్టర్ మాట్లాడుతూ పీఏబిఆర్ నీటి ప్రవాహం తగ్గిన విషయంలో వెంటనే వెళ్లి పరిశీలించాలని ఆర్డీఓ కేశవనాయుడుని ఆదేశించారు. కలెక్టర్ సూచన మేరకు ఆర్డీఓ కేశవ నాయుడు గోళ్లపల్లి సమీపంలోని పీఏబిఆర్ కాల్వలో ప్రవాహన్ని పరిశీలించారు. నీరు ఎంత మేర వస్తోంది.. ఎందుకు ప్రవాహం తగ్గిందన్న అంశాల గురించి కలెక్టర్ కు వివరించనున్నట్టు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాకే తిరుపాల్ ఎంపీడీవో విజయలక్ష్మి తాసిల్దార్ విజయకుమారి జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు .



ప్రజాభూమి



# సాంప్రదాయ గ్రామీణ క్రీడలు ముగింపు వేడుకలు

## పాల్గొన్న జ్యోతుల మణి, పెద్దాపురం డి.ఎస్.పి శ్రీహరి రాజు, తుమ్మలపల్లి రమేష్




ప్రజా భూమి జగ్గంపేట

కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జగ్గంపేట సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగ్గంపేట ఎస్సై రఘునందన్ రావు, కిర్లంపూడి ఎస్సై సతీష్, గండేపల్లి ఎస్సై శివబాబు నేతృత్వంలో ఈనెల రెండవ తారీఖున ప్రారంభించిన సాంప్రదాయ గ్రామీణ క్రీడలు ఆరు రోజులపాటు నిర్వహించి ముగింపు కార్యక్రమం సంక్రాంతి సంబరాలతో ముగించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సతీమణి కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షురాలు జ్యోతుల మణి, పెద్దాపురం డి.ఎస్.పి శ్రీహరి రాజు జగ్గంపేట జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ముందుగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటను జ్యోతుల మణి వెలిగించారు.గత ఆరు రోజుల నుంచి పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో జగ్గంపేట కాపు కళ్యాణ మండపం ఆవరణలో ఈ సాంప్రదాయ క్రీడలు నిర్వహించడం జరిగింది. ఈ క్రీడలు పోటీలలో జగ్గంపేట నియోజకవర్గంలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల నుంచి అనేక జట్లు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన అన్ని జట్లకు దాతల సహకారంతో జ్యోతుల మణి, తుమ్మలపల్లి రమేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అత్తులూరి నాగబాబు, పోతుల మోహనరావు, జీను మణిబాబు, పరిమి బాబు, కందుల చిట్టిబాబు, కాకినాడ జిల్లా భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, పుష్కర చైర్మన్ అడబాల భాస్కరరావు, రేఖ బుల్లి రాజు, పైడిపాల సూరిబాబు, తూము కుమార్, నకిరెడ్డి సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

# హైందవ శంఖారావంకి వెళ్ళిన హిందూ సైనికులకు సహకరించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు కృతజ్ఞతలు

## భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి బృందం



ప్రజా భూమి జగ్గంపేట

జగ్గంపేట మండలం ఇర్రిపాక శివ కేశవులు ఆలయం వద్ద జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ కు కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సత్కరించిన కాకినాడ జిల్లా భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి భారతీయ ధర్మ పరిషత్ సభ్యులు ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ విజయవాడలో ఈనెల 5వ తేదీన జరిగినశంఖారావం కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండ సభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గం నుండి 30 బస్సుల్లో బయలుదేరిన హిందూ సైనికులతో తుని, ప్రత్తిపాడు పరిసర ప్రాంతాలు నుండి వెళ్లిన హిందూ బంధువులందరికీ మురారిలో ఉదయం అల్పాహారం ఏర్పాటు చేయడమే కాకుండా తిరిగి వచ్చే దారిలో పులిహోర వాటర్ ప్యాకెట్స్ ఇచ్చి వారి క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చే కార్యక్రమం జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో నేను మా బృందం ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా కృతజ్ఞతగా వారికి అభినందన చెప్పడానికి జగ్గంపేట నియోజకవర్గం నుండి హిందూ బృందమంతా వచ్చి కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసేమని అన్నారు, ఈ కార్యక్రమంలో భారతీయ ధర్మ పరిషత్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్ఆర్బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ నందు ఓజెటి ట్రైనింగ్



ప్రజా భూమి ప్రతినిధి పిఠాపురం

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం ఆర్ఆర్బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 02-12-2024 నుండి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వారి ఉత్తర్వులనుసరించి ఒకేషనల్ గ్రూపులో ఒకటైన ఎమ్.అండ్ ఎ.టి (మెకానికల్ & ఆటోమెటైర్ టెక్నీషియన్ గ్రూప్ నందు ఓజెట్ ఆన్ జాబ్ ట్రైన్ కార్యక్రమ ప్రాంభించడమైనది.ఇందులో కళాశాల ప్రిన్సిపల్ వై.కేశవరావు మాట్లాడుతూ ఈ ట్రైనింగ్ కార్యక్రమం 02-12-2024 జనవరి 8-01-2025 నుండి వరకు నిర్వహించ బడునని తెలియజేసారు.ఈ శిక్షణా కార్యక్రమం వలన విద్యార్థులకు విద్యతో పాటు, వృత్తిలో నైపుణ్యం పెరిగి విద్యార్థుల భవిష్యత్తు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలియజేసారు.అందులో భాగంగా విద్యార్థులు స్థానికంగా పిఠాపురం ఉన్న ఆటో గ్యారేజీని సందర్శించి, ఇంజను పనిచేయించే విధానం, ఇంజనులో విడి భాగాలు మరియు వాటి ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం తరిగతి లెక్చరర్స్ కె.,శోభన్ బాబు మరియు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసినట్టు ప్రిన్సిపల్ తెలియజేశారు.

# ఏలేశ్వరంలోని కోడి కత్తులు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

## 160 కోడి కత్తులు స్వాధీనం - పెద్దాపురం డి.ఎస్.పి డి.శ్రీ హరిరాజు వెల్లడి



ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డి.ఎస్.పి డి శ్రీహరిరాజు పర్యవేక్షణ లో ప్రత్తిపాడు సిఐ బి. సూర్య అప్పారావు వచ్చిన అక్రమ కోడికత్తుల తయారికి సంబంధించిన సమాచారం మేరకు ప్రత్తిపాడు సిఐ బి. సూర్య అప్పారావు ఏలేశ్వరం ఎస్ ఐ ఎన్.రామలింగేశ్వరరావుతన సిబ్బంది తో కలిసి ఏలేశ్వరం గ్రామం లోని దిబ్బలపాలెం వీధిలో రైడ్ చేసి, ఎదురాడ మల్లేశ్వరరావు దిబ్బలపాలెం, ఏలేశ్వరం అను వ్యక్తి వద్ద నుండి కోడి పందాలకు ఉపయోగించే 160 కోడి కత్తులను స్వాధీనపర్చుకుని, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డి శ్రీహరి రాజు మాట్లాడుతూ సంక్రాంతి పండుగలు సందర్భంగా జరిగే కోడి పందాలు, జూదం వంటి వాటిని అరికట్టుట లో భాగంగా కోడిపందాలు, జూదం నిర్వహించే వారిపైన, కోడి కత్తులు తయారీ దారులపైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు , అందులో భాగంగా బుధవారం ఏలేశ్వరం గ్రామానికి చెందిన ఎదురాడ మల్లేశ్వరరావు అను వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి 160 కోడి కత్తులను స్వాధీన పర్చుకున్నామన్నామని తెలిపారు .ఇది ఒక హెచ్చరిక అని, అదేవిధంగా ప్రజలు కోడి పందాలు, జూదం వంటి వాటికి దూరంగా ఉండాలని, కుటుంబ సభ్యులతో సంతోషంగా ఆనందంగా సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకోవాలని ప్రజలకు ఆయన సూచించినారు.

# 19న గిరిజన సమ్మేళన సభను విజయవంతం చేయండి.

ప్రజాభూమి, కాకినాడ రూరల్

ఈనెల 19న గిరిజన ఆదివాసి సమ్మేళన సభ విజయవాడ వేదికగా నిర్వహిస్తున్నట్లు గిరిజన ప్రజా సమాఖ్య,గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.మధు కుమార్ తెలిపారు.మంగళవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం ఎస్ ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డా.ఎం.కమలకుమారి ముఖ్యఅతిథిగా హాజరై వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య జాతీయ కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులను జాగృతం చేసే కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని ఈనెల 19వ తేదీన విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో నిర్వహించే గిరిజన ఆదివాసి సమ్మేళన సభ



జయప్రదం చేయాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు.గిరిజన ప్రజా సమాఖ్య ఐక్యవేదిక రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి డా.ఎల్.మధుకుమార్ మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య అతిథిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్, ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు,కేరళ ఐజి లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ మరియు ప్రముఖ నేతలు హాజరవుతున్నారన్నారు. అదేవిధంగా గిరిజన సంస్కృతి సంప్రదాయాలతో గిరిజన కళాబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. గిరిజన ప్రజల జీవన ప్రమాణం స్థాయిని పెంచే లక్ష్యంతో గిరిజనుల ఆత్మగౌరా వానికై జరిగే గిరిజన ఆదివాసి సమ్మేళన సభకు వేలాదిగా గిరిజన ఆదివాసిలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మహమ్మద్ నదీమ్,డా.జోసఫ్ స్టీఫెన్, డా.గోపి,మనోజ్ దేవా, డా.హరి బాబు విద్యార్థులు కళ్యాణ్,ప్రవీణ్,సాయి ప్రవీణ్, వసంత్, పద్మాకర్, నందిని,కుమారి తదితరులు జిపిఎస్ వివిధ జిల్లాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పెద్దనాపల్లి ఎర్రవరం గ్రామాలలో పొలం పిలుస్తోందిలో ఎన్ పి ఎస్ ఎస్ ఆప్ కోసం రైతులకు అవగాహన

## మండల వ్యవసాయ శాఖ అధికారి బి జ్యోతి

ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

ఏలేశ్వరం మండలం పెద్దనపల్లి ఎర్రవరం గ్రామాలలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారిణి బి జ్యోతి మాట్లాడుతూ ఎన్ పి ఎస్ ఎస్ ఆప్ నందు ప్రతీ ఒక్క రైతు రిజిస్ట్రేషన్ చేసుకుని తమ పొలంలో ఉన్న పురుగు మరియు తెగుళ్ల వివరాలను ఫోటో తీసి అప్లోడ్ చేయడం ద్వారా నివారణ మార్గాలు తెలుసుకోవచ్చును అని తెలిపారు. పీఎండిఎస్ విత్తనాల సాగు ద్వారా భూసారాన్ని పెంచవచ్చని తద్వారా పంటకు అన్ని రకాల పోషకాలు అందుతాయని




తెలిపారు.జీవన ఎరువులు అజోస్పైరిల్లం, రైజోబియం, పాస్ఫో బాక్టీరియాల వినియోగం ద్వారా చాలా వరకు ఎరువుల వాడకం తగ్గడంతో పాటు నాణ్యమైన పంటను పండించి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుద్ధ సూర్య ప్రకాష్ సుంకర సత్యనారాయణ, గ్రామ నాయకులు బసా. మహాలక్ష్మి ప్రసాద్ మైరాల కనకరావు ఉగ్గిన సతీష్ గ్రామ వ్యవసాయ మరియు ఉద్యానవన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ పెద్దలు రైతులు పాల్గొనడం జరిగింది.



# జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో యువతకు క్రీడల పట్ల ఆసక్తి కల్పించడం అభినందనీయం.

## ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ

ప్రజా భూమి ప్రత్తిపాడు

ప్రత్తిపాడు హై స్కూల్ గ్రౌండ్ లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా ఎస్పీ విక్రమ్ పాటిల్ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ సంక్రాంతి సంప్రదాయ క్రీడలు పేరిట మండల స్థాయిలో కబడ్డీ పోటీ నిర్వహిస్తున్నారు. ఈ కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఈ క్రీడల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ మరుగున పడుతున్న గ్రామీణ క్రీడలను , సంక్రాంతి పండుగ పేరిట సంప్రదాయాలనుగుర్తు చేస్తూ , ప్రోత్సహిస్తున్న పోలీస్



శాఖ వారికి అభినందనలు అన్నారు.పోలీసు నిర్వహిస్తున్న ఈ క్రీడల ద్వారా గ్రామాల్లో ప్రజలకు, యువతకు, మరి పోలీస్ శాఖ వారికి మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని ఎమ్మెల్యే అన్నారు.క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు



గెలుపోవటమును సమానంగా స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డి.ఎస్.పి డి హరి రాజ ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ సూర్య అప్పారావు , ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం మరియు పెద్ద సంఖ్యలో ఎన్డీఏ శ్రేణులు పాల్గొన్నారు.

# చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణి చేసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

ప్రజా భూమి ప్రతినిధి,. ప్రత్తిపాడు

ప్రతిపాడులోని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కార్యాలయం లో 11,44,063 ? విలువ గల సీఎంఆర్ఎఫ్ ( సీఎంఆర్పి ) చెక్కులను క్రింది తెలిపిన విధంగా బాధితులకు , వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఆరోగ్యంతో వైద్య చికిత్సలు పొందిన మజ్జి రాజబాబు కు రూ.1,24,076 రూపాయల చెక్కునితల్లిబోయిన గోవింద్ కు 61,572 రూపాయల చెక్కుని చిట్రా హనుమంతుకి . 1,24,216 రూపాయల చెక్ ని బద్ది మహేంద్ర కి 1,97,820 రూపాయల చెక్ ని పిర్ల వెంకటేష్ కి 49,400 రూపాయల చెక్కునిఅరిగెల నాగమణి కి 34,500 రూపాయల చెక్కునపత్రి రాజుకి 1,80,178 రూపాయల



చెక్కునికటకం కిరీటిబాబు 56,191 రూపాయల చెక్కునిపచ్చిపులుసు వెంకటలక్ష్మీ కి 35,000 రూపాయల చెక్కునిపసల సూర్యనారాయణ కి 99,390 రూపాయలు చెక్ ని అంబటి వెంకటరావుకి 1,81,720 రూపాయలు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేయడం జరిగిందని తెలిపారు . ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు ధర్నా 54 వ రోజు ధర్నా

## ఇప్పటికైనా కార్మికుల సమస్య పరిష్కరించరా..... సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు

ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

గత ఏడాది నవంబర్ 16 వ తేదీన మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల యాజమాన్యం అర్థాంతరంగా మూసివేయడంతో రోడ్డునపడ్డ 406 మంది కార్మికులు గత 54 రోజులుగా అనేక విధాల ఆందోళన నిర్వహిస్తున్నారు. ఆందోళనలో భాగంగా బుధవారం ఫ్యాక్టరీ ఎదుట 54 వ రోజు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా



వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత 54 రోజులుగా కార్మికులు ఆకలితో అలమటిస్తూ అనేక విధాల ఆందోళనలు చేస్తున్న ప్రజాప్రతినిధులకు, యాజమాన్యానికి చీమకుట్టినట్టైనా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి చిన్న విషయానికి ప్రభుత్వం పై దుమ్మెత్తి పోసే ప్రతిపక్షాల సైతం కార్మికుల బాధలను అర్థం చేసుకోక పోవడం దురదృష్టకరమన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మిక సమస్యలు పరిష్కరించ లేమని పాత మాటే చెబుతూ కాలయాపన చేశారన్నారు. ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే వరకు పోరాటం ఆపేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అని శెట్టి వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, బి ఆది, ఎం కాంతారావు రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, పాపారత్నం, చంటి, వరలక్ష్మి ఉన్నారు.

# సావిత్రిబాయి పూలే విగ్రహ దాతకు ఘనంగా సన్మానం

ప్రజా భూమి జగ్గంపేట

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని కాకినాడ జిల్లాలోని జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేయడానికి ఆర్థిక సహకారం అందించిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆయుష్మాన్ తుమ్మల వెంకట సత్య రంగారావును బుధవారం సాయంత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మాన సభను వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఆయషష్మాన్ పులి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సన్మాన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధమ్మ గురువు %ఱ%.న్యాయవాది అరియ నాగసేన బోధి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాతా సావిత్రిబాయి పూలే జీవితం, త్యాగం, పోరాటం గురించి బోధిస్తూనే విద్యార్థులను ఉద్దేశిస్తూ స్ఫూర్తివంతమైన ప్రసంగం చేశారు. భారతీయ మహిళలు, ఈనాటి చదువుకున్న విద్యావంతులందరికీ చదువుల తల్లి సావిత్రిబాయి పూలే స్ఫూర్తిగా నిలుస్తారన్నారుభారతదేశానికి మహాత్ముడు జ్యోతిరావు పూలే అని, చదువుల తల్లి సావిత్రి బాయి పూలే మరియు షేక్ ఫాతిమాలని వారిని ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని పిల్లలకు వారి గురించి బోధించాలని అన్నారు.



భారతీయ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రి బాయి మరియు షేక్ ఫాతిమాలని కొనియాడారు. మహాత్మా పూలే దంపతులు వితంతు పునర్వివాహాలు, వితంతువులకు శరణాలయాలు ఏర్పాటు చేశారు అని ఆనాడు పూలే దంపతులు సామాజిక పరివర్తన కోసం నిస్వార్థసేవ చేశారన్నారు. విద్యార్థులు అసలైన మహనీయులు గురించి అధ్యయనం చేయాలని వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదువుకొని సమాజానికి సేవ చేయాలని అన్నారు. అనంతరం సన్మాన సభ జరిగింది.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ హెచ్ఎం బేగం టి ఎస్ యు ఎస్ జిల్లా అధ్యక్షులు ఎన్ కృష్ణమోహన్ ఎం ప్రకాష్ కుమార్ బిఎస్ఎన్ మూర్తి ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# తలపిండిపేట్లో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ...

## ప్రారంభించిన యనమల రాజేష్

ప్రజా భూమి తుని

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి కనపర్చాలని వైఘనల్ ఎండీ యనమల రాజేష్ క్రీడాకారులకు పిలుపునిచ్చారు.తొండంగి మండలం తలపంటిపేట గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించిన యనమల రాజేష్ తొలుత బ్యాటింగ్ చేసి ఆటగాళ్ళకు బెస్ట్ విషెష్ తెలిపారు అనంతరం జరిగిన సభలో ప్రసంగించిన ఆయన పోటీల్లో గెలుపు ఓటములు సహజమని,అందుకనే ప్రతి క్రీడాకారుడు గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డి



పో రా డా ల న్నా ర ు . క్రీడారంగాన్ని అన్నివిధాలా ప్రొత్సహి స్తామన్నారు ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు సీనియర్ నాయకులు కొయ్యా కేశవ్,కొయ్యా సూరిబాబు, చంద్రరావు,యాదాల సింహాచలం,మనిమిల కొండబాబు,కొయ్యా మల్లేష్,మారేటి లోవరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు

## నున్న వీర్రాజు కుటుంబానికి మాజీ మంత్రి వేణు పరామర్శ!

ప్రజాభూమి, రామచంద్రపురం



ఇటీవల మృతి చెందిన ద్రాక్షారామ ప్రముఖుడు నున్న వీర్రాజు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కృష్ణ పరామర్శించారు . ఈ మేరకు ఆయన బుధవారం దాక్షారామంలో పలువురు వైసీపీ శ్రేణులతో వీర్రాజు గృహానికి చేరుకుని నున్న వీర్రాజు చిత్రపటం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు , వైస్ ఎంపీపీ శాకా బాబి , నాయకులు బాలాంతరం రాజు, నున్న కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## కృత్తివెంటి పేర్రాజు పంతులు కళాశాలలో రంగవల్లి పోటీలు...!

### విజేతలకు బహుమతులు మంత్రి సుభాష్ తండ్రి సత్యం పంపండి.

ప్రజాభూమి,రామచంద్రపురం



రామచంద్రపురం శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాల ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో రామచంద్రపురం పాన్ షాప్ అసోసియేషన్ వేమగిరి కోకోకోలా బాటిల్ యూనిట్ కంపెనీ సౌజన్యంతో ముగ్గుల పోటీలు బుధవారం ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా బుర్రకథ కళాకారులు పూర్వ విద్యార్థి గొర్రెల శ్రీనివాస్ హరిదాసు వేషధారణతో అలరించగా యువత సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు .అలాగే పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పూర్వ విద్యార్థి సిరిగినేడి ప్రసాద్ సౌజన్యంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గంగరాజు ప్రధానోపాధ్యాయులు వీర రాఘవరెడ్డి, పిడి జంపని రఘురామ్ ,పాన్ షాప్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పడాల సూరిబాబు సిరిగినేడి దుర్గాప్రసాద్ ,ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకులు లావణ్య అనుపమ గణేశ్వరి రోషిని తదితరులు వ్యవహరించారు .అలాగే ఈ బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో కంచుమర్తి బాబురావు విశ్రాంత ఉపాధ్యాయులు సలాది వెంకప్ప నాయుడు, డిగ్రీ పిడి వీరబాబు , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి.

ప్రజాభూమి, రామచంద్రపురం.




రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమంలో తొలుత ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశం యొక్క కీర్తి ప్రతిష్టలను, సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి చాటినటువంటి గొప్ప యోధుడని కొనియాడారు. యావత్ ప్రపంచంలో ఉన్న యువతకి స్వామి వివేకానంద ఆదర్శప్రాయుడని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ బిఏ విద్యార్థిని పి నవ్య స్వామి వివేకానంద గెటప్పును ధరించి వివేకానంద వారు చికాగోలో ఇచ్చినటువంటి ఉపన్యాసాన్ని మాట్లాడి అందర్నీ ఆకర్షించింది. ఇంగ్లీష్ అధ్యక్షులు బేగం మాట్లాడుతూ స్వామి వివేకానంద పుస్తకాలను విద్యార్థులు తప్పనిసరిగా చదవాలని విద్యార్థులు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలంటే తప్పనిసరిగా వివేకానందుని అనుసరించాల్సిందేనని తెలియజేశారు. తదనంతరం వైస్ ప్రిన్సిపల్ పద్మజ డాక్టర్ ఎన్వి రమణ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులను ఆకర్షించారు. తదనంతరం వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ కాంపిటేషన్స్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ చేతుల మీదగా మొక్కలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమం హిస్టరీ డిపార్ట్మెంట్ చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జూదాల పట్ల విముఖత... సాంప్రదాయ క్రీడల పట్ల ఆసక్తి అవసరం

### పెద్దాపురం డిఎస్పీ శ్రీహరిరాజు

ప్రజాభూమి శంఖవరం:



నేటి సమాజంలో పండుగల వేళ జూదాలు, కోడి పందాలపై విముఖత చూపాలని, సాంప్రదాయ క్రీడలైన వాలీబాల్, క్రికెట్ పోటీల పట్ల ఆసక్తి కనబరచాలని పెద్దాపురం డిఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శంఖవరం మండలంలోని అన్నవరంలోగల శ్రీ సత్యదేవ డిగ్రీ కళాశాల ఆవరణలో అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో జూదాలు వద్దు... సాంప్రదాయ క్రీడలు ముద్దు... అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన డిఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు వాలీబాల్ పోటీలను ప్రారంభించి,యువతను అభినందించారు. ఈ సంధర్భంగా డిఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ పండుగల ముసుగులో కోడి పందాలు, జూదం వంటి వాటిపై మక్కువ చూపడం ద్వారా జీవితాలు నాశనం చేసుకోవద్దని, వీటి వల్ల కుటుంబ వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. వీటిపై ఆకర్షితులు కాకుండా సాంప్రదాయ క్రీడలైన వాలీబాల్, క్రికెట్, కబడ్డీ వంటి ఆటల పోటీలకు ప్రాదాన్యతనిచ్చి, పాల్గొనడం వల్ల ఉల్లాసంతోపాటు శారీరక ధారుద్యం, ఆరోగ్యం మెరుగవుతాయన్నారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విధ్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ మెరుగుపరచడానికి చర్యలు తీసుకోండి: మేకల కృష్ణ

ప్రజాభూమి శంఖవరం :




ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ సబ్ ప్లాన్ ఏజెన్సీ ప్రాంతమైన ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా టెలి కమ్యూనికేషన్స్ అడ్వైజరీ మెంబర్ మేకల కృష్ణ అన్నారు. కాకినాడలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నందు జిల్లా టెలి కమ్యూనికేషన్ జనరల్ మేనేజర్ పలివల రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా టెలికాం సలహా మండలి సభ్యులు హాజరయ్యారు. తొలుతగా పలివల రాజుకు సభ్యులు పుష్ప గుచ్చం అందించి సత్కరించారు. సమావేశంలో మెంబర్ మేకల కృష్ణ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరచాలని, ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానానికి రోజు వేలమంది భక్తులు రావడం జరుగుతుందని, అన్నవరంలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, మండల స్థాయిలో ఉన్న టెలిఫోన్ ఎక్స్చేంజ్ ను మెరుగుపరిచి, ఫైబర్ నెట్వర్క్ ను పునరుద్ధరించాలని కోరారు. జనరల్ మేనేజర్ పలివల రాజు మాట్లాడుతూ మీరు చెప్పిన సమస్యలను రాష్ట్ర, కేంద్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని మెరుగైన సిగ్నల్స్ వ్యవస్థను వినియోగదారులకు అందుబాటులోకి వచ్చేలా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టి వెంకటేశ్వరరావు, దొడ్డి దుర్గాప్రసాద్, గేదెల వెంకటరావు, సత్యనారాయణ, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోటి హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు...!

**చూపరులను కట్టుకున్న విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు.**
**పలువురు ఎన్డీఏ కూటమికి చెందిన నేతలు హాజరు.**
**రంగవల్లిలతో సుందరంగా తీర్చిదిద్దిన ప్రాంగణం.**

ప్రజాభూమి, కాజులూరు .








మండల కేంద్రమైన కాజులూరు గ్రామంలో శ్రీ కోటి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆ పాఠశాల విద్యార్థి విద్యార్థులతో వివిధ సాంస్కృతి కార్యక్రమాల ద్వారా సంక్రాంతి శోభ ఉట్టుపడేలా అట్టహాసంగా నిర్వహించారు. కరస్పాండెంట్ కాద కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం , గొల్లపాలెం సబ్ ఇన్స్పెక్టర్ మోహన్ కుమార్ ,పలువురు కూటమి నేతల సమక్షంలో అంగ రంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో విద్యార్థినిలుచే వివిధ రకాల ముగ్గులతో ప్రాంగణం సుందరంగా తీర్చిదిద్దగా, ముందస్తుగా భోగి మంటను వెలిగించి, సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు, అలాగే విద్యార్థిని విద్యార్థులు కార్యక్రమంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టు కున్నాయి. దీంతో ఇక్కడ హైస్కూల్లో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు నూతన శోభన సంతరించుకుని మన సాంస్కృతి సాంప్రదాయాలకు ఉట్టిపడేలా అత్యంత అట్టహాసంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, గొల్లపాలెం సబ్ ఇన్స్పెక్టర్ మోహన్ కుమార్, ,పంచాయతీ కార్యదర్శి ఈశ్వరి,, మండల విద్యాధికారి డేవిడ్ , మాజీ సొసైటీ అధ్యక్షులు యాళ్ల వెంకటరమణ, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వివిధ శాఖల పరాయికరణ భూముల సంబంధించి అనుమతులు మంజూరు పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

### తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశం

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం



వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి విషయంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు ద్వారా భూముల పరాయీకరణ (అలీనేషన్) సంబందించి అనుమతులు మంజూరు కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల పరాయికరణ భూముల, పి వి జి టి (గ్రూప్స్), భూపతిపాలెం పిఎం జన్మన్ గృహాలు అంశాలపై సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాటాడుతూ, జిల్లాలో సంక్షేమ, ఏపి ట్రాన్సకో, ఎయిర్ పోర్టు, టూరిజం, క్రీడలు , జాతీయ రహదారులు, మార్కెటింగ్, పశు సంవర్ధక, విద్య, ఆరోగ్య తదితర శాఖలకు చెందిన 54 భూ సంబంధ అలీనేషన్ ప్రక్రియ పై శాఖాధికారులు దృష్టికి తీసుకుని వెళ్లడం, తగిన అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ఆయా భూముల పరాయీకరణ కి చెంది ఆర్డీవోలు మూ జారీ చెయ్యాల్సిన అనుమతులు మార్గదర్శకాలను అనుసరించి మంజూరు చేయాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా బలహీన గిరిజన సమూహాలు చెందిన 99 కుటుంబాల కు చెందిన 399 మందికి తగిన గుర్తింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయమై విచారణ చేపట్టాలని, నివేదికలు ఆధారంగా వారికీ ప్రభుత్వ పరంగా చేయూత నివ్వడం పై దృష్టి పెట్టాలని ఆర్డీఓలు , హౌసింగ్ , రెవిన్యూ, ఐ సి డి ఎస్, డీ ఈ వో , డి ఆర్ డి ఎ, బ్యాంకర్లలని ఆదేశించారు. ఇతర ప్రభుత్వ శాఖల అధ్వర్యంలో వారికీ అందవలసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అమలు చేయాలని పేర్కొన్నారు. ఆధార్ సంఖ్య, రేషన్ కార్డు, గృహాలు లేని వారికి ఇళ్లు, స్థలం ఉన్నవారికి ఇళ్ళ నిర్మాణం కోసం గృహ నిర్మాణ మంజూరు, స్వయం జీవనోపాధి కల్పించడం, వారి పిల్లలు విద్యా అభ్యసించేలా ఆయా కుటుంబాల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టలని సూచించారు. భూపాలపట్నం భూ సేకరణ ప్రక్రియ పై సమగ్రంగా వివరాలు అందచేయాలని కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, ఆర్డీవోలు ఆర్ కృష్ణ నాయక్, రాణి సుస్మిత, కే ఆర్ సి సి ఎస్డిసీ / ఇన్చార్జి జిల్లా హౌసింగ్ అధికారి డి. భాస్కర్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె ఎన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పి

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం



జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పి డీ నరసింహ కిషోర్ లు స్వాగతం పలికారు. బుధవారం ఉదయం రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకున్న మాజీ ఉప రాష్ట్రపతి కి స్వాగతం పలకడం జరిగింది.గోదావరీ గ్లోబల్ విశ్వ విద్యాలయంలో జరుగుతున్న రెండవ తెలుగు మహాసభలు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మాజీ ఉప రాష్ట్రపతి ఎమ్.వెంకయ్య నాయుడు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పి డీ నరసింహ కిషోర్ లు స్వాగతం పలకడం జరిగింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం లో స్వాగతం పలికిన వారిలో ఎయిర్ పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర్ రావు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి సూచనలు ఇవ్వండి

### జనరల్ మేనేజర్ రాజు

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం




బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి అమూల్యమైన సూచనలు, సలహాలు అందిస్తే వాటిని అమలు చేయడానికి కృషి చేస్తానని తూర్పుగోదావరి జిల్లా బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు పేర్కొన్నారు. స్థానిక బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజి కార్యాలయంలో టెలికం సలహాదారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాజు అధ్యక్షత వహించగా అధికారులు టి నాగరాజు, రాజశేఖర్ బాబు, సైదా నాయక్, భమిడి శ్రీనివాస్, ఈశ్వరరావు, సలహా సంఘ సభ్యులు ఎం ఎస్ ఆర్ వి సత్యనారాయణ, దొడ్డి దుర్గాప్రసాద్, గట్టి వెంకటేశ్వరరావు, గేదెల వెంకటరావు, మేకల కృష్ణ, అలుచూరి వరప్రసాద్ పాల్గొన్నారు.

## వరదలు ప్రకృతి విపత్తుల నిర్వహణ కోసం ప్రతిపాదిత పనుల విషయంలో సమగ్ర నివేదిక అందజేయండి

### అధికారుల నాదేశించిన జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

ప్రజా ప్రతినిధి రాజమహేంద్రవరం



జూలై, ఆగష్టు , సెప్టెంబరు నెలలలో వరదలు, ప్రకృతి విపత్తుల నిర్వహణ కోసం ప్రతిపాదిత పనుల విషయంలో సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందచేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు.బుధవారం ఉదయం అమరావతీ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టీ ఆర్ 27 పై, సీసీఎల్ ఏ కమిషనర్ రీ సర్వే పై సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జెసి ఎస్ చిన్న రాముడు, డిఆర్వో టి. సీతారామ మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జూలై నెలలో సంభవించి ఆకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిహారం ఎన్యుమారేషన్ చెయ్యడం జరిగిందని తెలిపారు. సెప్టెంబర్ నెలలో విజయవాడ వరద సమయంలో పునరావాస కార్యక్రమంలో భాగంగా ఆహారాన్ని, ఇతరములను తూర్పు గోదావరి జిల్లా నుంచి పంపడం జరిగిందనీ తెలిపారు. హార్టికల్చర్ పంట పరిహారాన్ని4 అందజేయడం జరిగిందని తెలిపారు. ఎర్ర కాలువ పనులకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ద్వారా సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేసి చేపట్టవలసిన పనులు పై ఈ ఎన్ సి కి ప్రతిపాదనలను పంపినట్లు తెలిపారు.సీసీఎల్ఏ కమిషనర్ జి. జయలక్ష్మి రీ సర్వే, సభల నిర్వహణా, అర్జీలు పరిష్కార స్థాయి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ చిన్న రాముడు వివరాలు తెలియ చేస్తూ, జిల్లాలో రెవిన్యూ గ్రామాల పరిధిలో రెవిన్యూ సదస్సు లని నిర్వహించడం జరిగిందన్నారు. బుధవారం తో అన్ని గ్రామాలలో రెవిన్యూ సదస్సు నిర్వహించినట్లు తెలియ చేశారు. నిన్నటి వరకు మొత్తం 3180 అర్జీలను స్వీకరించడం జరిగిందనీ వాటిలో 1227 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 1708 కి గాను 834, రాజమండ్రీ డివిజన్ పరిధిలో 1442 కి గాను 393 అయినట్లు తెలియ చేశారు. జిల్లా కలెక్టర్ వారి అధ్వర్యంలో, వారీ ఆదేశాలను అనుసరించి జవాబుదారితనం తో కూడిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రెవిన్యూ విభాగం ద్వారా అందచేసే సేవలను ఎటువంటి రుసుము వసూలు చెయ్యకుండా పరిష్కారం చెయ్యడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, డి ఆర్వో టి సీతారామ మూర్తి , కలక్టరేట్ పరిపాలన అధికారి ఎమ్డి ఆలీ, డిప్యూటి తహసిల్దార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూము ప్రారంభించినకాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్

ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ



కాకినాడ పులవర్తి వారి వీధి నందు వైశ్యరాజు జ్యూయలర్స్ వారి నూతన షోరూము ప్రారంభానికి ముఖ్య అతిధిగా కాకినాడ పార్లమెంట్ లోక్ సభ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ , ప్రత్యేక అతిధిగా కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) విచ్చేసి, షోరూము ను ప్రారంభించారు . ముందుగా ప్రముఖ వ్యాపారవేత్త పాబోలు బాబురావు జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమములో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్– వైశ్యరాజు ఫల్గుణరాజు , తుని షోరూము నిర్వాహకులు నారాయణరావు పాల్గొన్నారు. అనంతరం సోము దుర్గాప్రసాద్ మొదటి కొనుగోలును చేసారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతమైన కాకినాడ లో మా షోరూమును ఎప్పటి నుంచో ప్రారంభించాలని అనుకున్నామని . అందునా ఈ పండుగ మాసములో ప్రారంభించడం చాలా సంతోషమని అన్నారు . అలాగే ప్రారంభోత్సవ ఆఫర్ గా అన్ని రకాల 22 క్యారెట్ బంగారు ఆభరణాలును ఫ్లాట్ 6 శాతం తరుగు కే ఆభరణాలును పొందవచ్చునని అలాగే సంక్రాంతి ఆఫర్ గా సాదారణ వెండి వస్తువులపై తరుగు లేదు, మజూరి లేదు. GST నీ కూడా మీ తరుపున మీమే చెల్లిస్తామని అదనంగా కేజి వెండి వస్తువుల కొనుగోలు పై కేజి కి 10,000 రూపాయలు – వరకు తగ్గింపు పొందవచ్చని ప్రతి ఒక్కరూ షోరూముకి విచ్చేసి, మా ప్రత్యేకమైన డిజైనరీ కలెక్షన్లను ఎంపిక చేసుకొని, ఈ ఆఫర్ ని వినియోగించ వలసిందిగా కోరారు . ఈ కార్యక్రమములో సంస్థ డైరక్టర్లు వైశ్యరాజు నరేష్ రాజు , వైశ్యరాజు కిరణ్ కుమార్ రాజు మరియు పి. వెంకట నాగ సూర్య పున్నయ్య , పి. వెంకట సింహాచలం , గుల్లపూడి నందూ గ, పేకెటి ఈశ్వర్లు పాల్గొన్నారు.



## ఎస్ ఎస్ సి విద్యార్థులకు ఎస్టీయు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాభూమి పోరుమామిళ్ల:



పదవ తరగతి విద్యార్థుల కోసం ఎస్టీయు రూపొందించిన స్టడీ మెటీరియల్ చాలా ఉపయోగకరమని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఎగువరామాపురం,కలసపాడు బాలురు, బాలికలు, కెజిబివి,శంఖవరం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలల యందలి సుమారు 200 మంది పదవ తరగతి విద్యార్థులకు రాజుపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు కె.వెంకటసుబ్బారెడ్డి దాతృత్వంతో స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చదివే పదవ తరగతి విద్యార్థుల కోసం రాష్ట్రంలోనే పేరొందిన సబ్జక్టు నిపుణులచే ఎస్టీయు స్టడీ మెటీరియల్ రూపొందించడం జరిగిందని,ఈ మెటీరియల్ అన్ని సబ్జెక్టులలో చాప్టర్ల వారీగా వెయిటేజ్ ప్రకారం ప్రశ్నలను పొందుపరుస్తూ రూపొందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు ఈ మెటీరియల్ చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. మండలశాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎస్వీ.ప్రసాద్ లు మాట్లాడుతూ ఎస్టీయు కేవలం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనే కాక సమాజసేవలో సైతం తనవంతు సేవలు అందిస్తుందన్నారు. మండలంలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు సంబంధించిన వృత్తిపరమైన,సర్వీసు పరమైన సమస్యలు పరిష్కరించడంలో ఎల్లపుడూ అందుబాటులో ఉంటామన్నారు.ప్రభుత్వం కూడా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో చాలా నిర్లిప్తంగా ఉందన్నారు.ఇది మంచి పద్ధతి కాదన్నారు.వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించడంతో పాటు పెండింగులో ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మెర్సీమాలిని,బ్రహ్మారెడ్డి,సలోమి సత్యవతి,రెడ్డిజ్యోతి,క్రిష్ణానాయక్ లు, ఎస్టీయు నాయకులు శేఖర్ బాబు,కస్తూరి శ్రీనివాసులు, కె.వి.సత్యనారాయణ, జోగారావు, బేబీసరోజ, మస్తాన్,మహబూబ్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చేతుల మీదుగా గౌడ సంఘం క్యాలెండర్లు ఆవిష్కరణ

ప్రజాభూమి, ప్రొద్దుటూరు



ది ప్రొద్దుటూరు గౌడ (ఈడిగ) సంక్షేమ సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి, టిడిపి బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు రామయ్య గౌడ్, సెక్రటరీ పొన్నాల రామకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

## 11న తిరుప్పావై - ధనుర్మాస వ్రత మహోత్సవము

ప్రజాభూమి, ప్రొద్దుటూరు



స్థానిక పాతమార్కెట్ లో వున్న లలితాదేవి, రతనాల వెంకటేశ్వర స్వామి (అన్నా చెల్లెలు) ఆలయంలో ఈనెల 11వ తేదీ శనివారం తిరుప్పావై - ధనుర్మాస వ్రత మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 5:30 గంటలకు మహిళలచే దీపాలతో నగర సంకీర్తన, తిరుప్పావైలోని 27వ పాసురమైన కూడారై వెల్లుం శీర్ గోవిందా అనే కార్యక్రమంలో శ్రీ కృష్ణునికి ప్రీతిపాత్రమైన పాయసమును 108 మట్టి పాత్రలలో నివేదన చేసి భక్తాదులకు ప్రసాదముగా ఇవ్వబడునని వివరించారు. కార్యక్రమంలో స్వామి వారి భక్తాదులు, ప్రజలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సూచించారు. కాగా13వ తేదీ సోమవారం భోగి పండుగ రోజు ఉదయం 11గంటలకు శ్రీ గోదాదేవి శ్రీ రంగనాయకుల స్వామి వారి కళ్యాణము, రాత్రి 8గం?లకు పాన్పుసేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

## హౌసింగ్ ఫర్ ఆల్ క్రింద దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాభూమి, ప్రొద్దుటూరు

హౌసింగ్ ఫర్ ఆల్ క్రింద అర్హులైన లబ్ధిదారులు ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలం వుండి ఇళ్లు నిర్మించుకోలేని వారు, పట్టా స్థలం వుండి ఇంటి నిర్మాణం చేసుకోలేని నిరుపేదలు కేంద్ర ౦- రాష్ట్ర ప్రభుత్వాలు అందించే హౌసింగ్ ఫర్ ఆల్ స్కీం క్రింద సచివాలయం ద్వారా నమోదు చేసుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు 9985573184 నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

## శుక్రవారం ఎస్సార్ఐటీలో సంక్రాంతి సంబరాలు

ప్రజాభూమి, ప్రొద్దుటూరు

స్థానికశ్రీ సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈనెల 10వ తేది శుక్రవారం ట్రెడిషనల్ డే సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మెన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు కళాశాల విద్యార్థిని, విద్యార్థులచే ట్రేడిషనల్ డే సంక్రాంతి సంబరాలలో భాగంగా రంగోలి, కోలాటం, ఉత్తమ వస్త్రాలంకరణ, పిండి వంటలు, చెక్క భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫోటోగ్రఫీ, చిత్రలేఖనం, బొంగరాలాట నిర్వహిస్తున్నామని వివరించారు.

## శనివారం సిబిఐటిలో సంక్రాంతి సంబరాలు

ప్రజాభూమి, ప్రొద్దుటూరు

ఈ నెల 11వ తేదీ శనివారం విద్యానగర్ లోని చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని కళాశాల ఛైర్మన్ జయ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు రంగోలి, గాలిపటాల ఎగుర వేయుట, కోలాటం, హరిదాసు కీర్తనలు, బొంగరాలు, గోలీలాట, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

## శ్రీ చైతన్య హై స్కూల్ ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు - కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్ ముందస్తు సంక్రాంతి ఉత్సవాల భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల ముగ్గులతో తమ ప్రతిభను చాటి చెప్పారు. పాఠశాల ఆవరణంలో రంగు రంగుల ముగ్గులతో కళాత్మకంగా అలంకరించబడింది. సంప్రదాయ ముగ్గులతో పాటు, ఆధునిక శైలిలో రూపొందించిన డిజైన్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతి ముగ్గులో విద్యార్థుల పరిశ్రమ, కళాత్మకత స్పష్టంగా ప్రతిఫలించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి విద్యార్థుల కళా నైపుణ్యాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు వారి సాంస్కృతిక అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు బి. చెతన్ రెడ్డి మరియు బి. చైతన్య రెడ్డి కూడా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ కనుమరుగవతుంది

### ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయి ప్రభుత్వ సలహాదారులు నాగార్జునరెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల:



అమెరికాలోని చార్లెట్ నుండి. పోతిరెడ్డి నాగార్జున్ రెడ్డి మాజీ ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టి ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ కనుమరుగయింది. ఈరోజు నుంచి ఆంధ్రప్రదేశ్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆసుపత్రిల అసోసియేషన్ ప్రకటించింది. ఇప్పటినుంచే. ఈ హెచ్ ఎస్. ఓపి సేవలను బందు చేస్తామని తెలిపింది ప్రభుత్వంతో చర్చలు సఫలం కాకపోతే ఈనెల 26 నుంచి అత్యవసర సేవలను కూడా నిలిపి వేస్తామని.3000 వేల కోట్లు బకాయిలు చెల్లించాలని యాజ మాన్యం డిమాండ్ చేస్తున్నాయి .ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత. ఆరోగ్యశ్రీ. కనుమరుకవడం జరుగుతున్నదని. ఇప్పుడు ఈ ప్రభుత్వం ఒక ప్రైవేటు ఇన్సూరెన్స్ భీమకంపెనీకి వైద్యానికి సంబంధించి. కేవలం రెండున్నర లక్ష వరకు భీమ అందే విధంగా చేయడం జరుగుతు న్నదని. మీడియాలో వార్త పత్రికల్లో రావడం జరిగిందని. ఇప్పుడు సామాన్య ప్రజలు అనా రోగ్య పాలు అయితే.రెండున్నర లక్షలు ఎక్కువ ఖర్చు అయితే వారి పరిస్థితి ఆ దేవుడే కాపాడాలని ఆయన అన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ అమలు చేయకపోవడం. ఏడు నెలల్లోనే .లక్ష కోట్లు.పైగా అప్పు చేయడం కేవలం అమరావతి కి సంబంధించి ఖర్చు చేయడం ప్రజల సంక్షేమ పథకాలు అని యు ఆగిపోవడం. జరిగిందని. దీనికి కారణం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని కూటమి నాయకులు ముఖ్యమంత్రి చెప్పటం ప్రతి ప్రభుత్వ వైఫల్యానికి జగన్మోహన్ రెడ్డి కారణమని.ఎల్లో మీడియా లో ఎల్లో పత్రికలో ప్రచారం చేయడం జరుగుతుందని ప్రతి ఒక్క విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని. ప్రభుత్వం ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసిన సోషల్ మీడియా.టీ.వీ. యూట్యూబ్ద్వారా ప్రజలు అన్ని విషయాలు తెలుసు కుంటున్నారని ప్రజలే తగిన గుణపాఠం ప్రభుత్వానికి చెప్తారని ఆయన అన్నారు.

## పేదలకు, విద్యార్థిలకు ఆపన్న హస్తం ఎఫ్.సి.యన్. ఫౌండేషన్

### ఎందరో గ్రహణ మొర్రి చిన్నారుల మొహాల్లో ఆనందం నింపిన దంపతులు డాక్టర్ గీత,తోమాస్ రెడ్డి చిత్తా దంపతులు

ప్రజాభూమి పోరుమామిళ్ల:





పేదలకు అనాధలకు విద్యార్థిని విద్యార్థులకు ఆపన్న హస్తం ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్ రెడ్డి చిత్తా దంపతులు తెలుగు రెండు రాష్ట్రాలలో వేలాది మంది విద్యార్థుల దశ దిశ మార్చి వారి బంగారు భవిష్యత్తుకు స్పాన్సర్ సిప్ ద్వారా దోహదపడ్డారు. వారు చేస్తున్న సేవలను గుర్తించి తెలుగు రెండు రాష్ట్రాలలో ఎన్నో అవార్డులు రివార్డులు అందుకున్నారు. కడప జిల్లా పోరుమామిళ్లలో, హైదరాబాద్ షాద్నగర్ తమ బ్రాంచ్ ను ఏర్పాటు చేసి వాటి ద్వారా వేలాదిమంది విద్యార్థులకు, గ్రహణ మొర్రిగ్రస్తులకు, వితంతువులకు, అనాధ వృద్ధులకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఎందరినో ఆదుకున్నారు. ఎఫ్.సి.యన్ స్పాన్సర్షిప్ ప్రోగ్రామ్ ద్వారా వేరువేరు ప్రాజెక్టులలో రెండు వేల మంది పేద అనాధ పిల్లలు చదువుతున్నారు. ఇప్పటికే దాదాపు కొన్ని వందల మంది ఎఫ్. సి.యన్ స్పాన్సర్ ద్వారా చదివి దేశ విదేశాలలో స్థిరపడి ఉన్నారు. ప్రతి సంవత్సరం 25 మంది పేద మరియు వితంతు మహిళలను సెలెక్ట్ చేసి వారికి పది నెలల పాటు కుట్టులో శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్ అందజేస్తున్నారు. డాక్టర్ గీతా మారుమూల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి మెడికల్ క్యాంపులు నిర్వహించడం యుక్త వయసు అమ్మాయిలకు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించడం చేస్తున్నారు. వృద్ధాశ్రమాలు నెలకొల్పి దాదాపు 45 మంది పేద అనాధ వృద్ధులను వికలాంగులను షాద్నగర్ సమీపంలో ఎఫ్.సి.యన్ హెూమ్ ద్వారా అన్ని వసతులు కల్పించి వారి ఆలనా పాలన చూస్తున్నారు. కండరక్షిణత వ్యాధితో బాధపడుతున్న వారికి స్పాన్సర్షిప్ ప్రోగ్రామ్ ద్వారా వైద్యం,మందుల కోసం సహాయం అందిస్తున్నారు. గ్రహణ మొర్రి బాధిత చిన్నారులకు ఇప్పటివరకు గత 10 సంవత్సరాలుగా 2000 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడం జరిగింది ఆపరేషన్లకు వచ్చే వారికోసం హాస్పిటల్ లో ఉచిత వసతి భోజన సౌకర్యాలను ఏర్పాటు చేయడమే కాకుండా రానుపోను రవాణా చార్జీలు కూడా అందజేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే వారు చేసే ఎన్నో అద్భుతమైన సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. చేస్తూనే ఉంటారు.



## ఎక్కడున్నా భారతీయులు భారతీయులే.... నేడు ప్రవాస భారతీయుల దినోత్సవం

ప్రజాభూమి, ప్రొద్దుటూరు




ఏదేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భారతిని, ఎక్కడున్నా భారతీయులు భారతీయులే.... అని గర్వంగా చెప్పుకుందాం.... నేడు ప్రవాస భారతీయుల దినోత్సవం సందర్భంగా... ప్రవాస భారతీయుల దినోత్సవం భారతదేశ అభివృద్ధికి విదేశీ భారతీయ వర్గాల సహకారాన్ని గుర్తించడానికి భారతదేశపు రిపబ్లిక్ ద్వారా జనవరి 9 న ఏటా జరిగే వేడుక రోజు. జనవరి 9, 1915 న దక్షిణాఫ్రికా నుంచి మహాత్మా గాంధీ తిరిగి ముంబై కి తిరిగి వచ్చిన సందర్భంగా ప్రవాస భారతీయుల దినోత్సవము జరుపుతారు. 2003 లో స్థాపించబడి, ఇది భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమాఖ్య, భారత పరిశ్రమల సమాఖ్య, నార్త్ ఈస్టర్న్ రీజియన్ యొక్క అభివృద్ధి మంత్రిత్వ శాఖ చేత స్పాన్సర్ చేయబడింది. ఒక వేడుక కార్యక్రమం ఒక భారతీయ నగరంలో ప్రతి సంవత్సరం 9 జనవరి న జరుగుతుంది ఇండియన్ ప్రవాసల సంబంధించిన సమస్యల నివరణ, ప్రవాసీ భారతీయ సన్మాన పురస్కారలు అందించును. ప్రవాసీ భారతీయ దివస్ భారతదేశ అభివృద్ధిలో ఓవర్సీస్ ఇండియన్ కమ్యూనిటీ యొక్క సహకారానికి గుర్తుగా 2003 నుండి ప్రతి సంవత్సరం జనవరి 9న జరుపుకుంటారు. 1915లో గొప్ప ప్రవాసీ అయిన మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చి, భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి, భారతీయుల జీవితాలను శాశ్వతంగా మార్చిన రోజున జనవరి 9ని ఈ సందర్భాన్ని జరుపుకోవడానికి ఎంచుకున్నారు.

2015 నుండి, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ప్రవాస భారతీయుల దినోత్సవం జరుపుకోవడానికి మరియు విదేశీ దయాస్పోరా నిపుణులు, విధాన రూపకర్తలు మరియు వాటాదారుల భాగస్వామ్యంతో ఈ మధ్య కాలంలో థీమ్-ఆధారిత PBD సమావేశాలను నిర్వహించడానికి దాని ఫార్మాట్ సవరించబడింది. ఈ సమావేశాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న విదేశీ భారతీయ కమ్యూనిటీ మధ్య నెట్వర్కింగ్లో చాలా ఉపయోగకరంగా ఉన్నాయి మరియు వివిధ రంగాలలో వారి అనుభవాలను పంచుకోవడానికి వీలు కల్పిస్తాయి. 2014 లో ప్రవాస భారతీయుల దినోత్సవం న్యూఢిల్లీలో జరిగింది, 51 దేశాల నుండి 1,500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డులను ఇచ్చారు.

## : మాజీ సైనికునికి డివిజన్ సైనిక సంక్షేమ సంఘం సభ్యుల అశ్రు నివాళి

ప్రజాభూమి, ప్రొద్దుటూరు:



ప్రొద్దుటూరు కు చెందిన మాజీ సైనికుడు రాజశేఖర్ రెడ్డి మంగళవారం అనారోగ్య కారణాల వలన బెంగుళూరులో తుది శ్వాస విడిచారు. ఆయన అంతిమ క్రియలు బుధవారం కుటుంబ సభ్యులు ఆయన ప్రొద్దుటూరులో నిర్వహించగా, ప్రొద్దుటూరు డివిజన్ సైనిక సంక్షేమ సంఘం తరుపున మాజీ సైనికులు ఆయన ఇంటి వద్దకు పోయి ఆయన పార్థివ దేహానికి ఘనంగా నివాళులు అర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులకు చట్టపరంగా గవర్నమెంటు నుండి రావలసిన బెనిఫిట్స్ అన్నీ తెప్పిస్తామని మరియు అన్ని విధాల వారి కుటుంబానికి అండగా ఉంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు డివిజన్ సైనిక సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ యన్ బాల వీరా రెడ్డి, జనరల్ సెక్రెటరీ అండ్ ట్రెజరర్ కే శాంబశివా రెడ్డి, అడ్వైజర్ నెల్సన్, మెంబర్లు మోహన్, నారాయణ రెడ్డి, ఓబులేసు, యమ్ ఆర్ కే రెడ్డి, పెద్దన్న, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇస్కాన్ వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు పూజ్యశ్రీ వేదవ్యాస ప్రియ స్వామి మహారాజ్

ప్రజాభూమి, ప్రొద్దుటూరు



స్థానిక త్రీ టౌన్ పోలీసు స్టేషను సమీపంలోని ఇస్కాన్ మందిరంలో జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు పూజ్యశ్రీ వేదవ్యాస ప్రియ స్వామి మహారాజ్ విచ్చేయనున్నారని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 10 వ తేది వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం 4.30 నుంచి వైకుంఠ వాసుని ప్రత్యేక దివ్య దర్శనం, ప్రత్యేక వెన్న లడ్డు ప్రసాద వితరణ, భగవంతుని దర్శనం, మంగళ హారతికి హాజరయ్యే ప్రతి ఒక్క కుటుంబానికి విశేషమైన ఒక ప్రత్యేక క్యాలెండర్ ఉచితమని వివరించారు. నిత్యం దుఃఖంలో మునిగిపోయిన ప్రజలను ఉద్ధరించటానికి సర్వ సమస్యల నుంచి బయటపడ వేసే ఏకైక చరమ పరిష్కారమైన భగవద్గీత భాగవతంలను తాను ఆచరిస్తూ అమెరికా, న్యూజిలాండ్, ఫిజి, థాయిల్యాండ్, ఆఫ్రికా వంటి దేశాల ప్రజలకు భగవద్గీత భాగవతంలను వివరిస్తూ, ఉద్ధరిస్తూ వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మన ప్రొద్దుటూరు ఇస్కాన్ మందిరానికి వస్తున్న భగవంతునికి అత్యంత ఇష్టమైన శుద్ధ భక్తులు పరమ పూజ్యశ్రీ వేదవ్యాస ప్రియ స్వామి మహారాజ్ ను ఏకాదశి పర్వదినం రోజున దర్శించుకునే మహా మహా సువర్ణ అవకాశం ఉందని తెలియచేశారు.

## వ్యాచరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల నియోజకవర్గం తొండూరు మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అగడూరు విద్యా ర్థులకు మానవతా సేవా సంస్థ సభ్యులు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,రిటైర్డ్ లెక్చరర్, మానవత సెక్రటరీ గంగిరెడ్డి , ఈసీ మెంబర్ రాజేశ్వర్ రెడ్డి , మానవతా చైర్మన్ కొండారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబు రెడ్డి మానవతా విలువలు విద్యార్థులు నైతిక విలువలు గూర్చి వివరించారు. బుధవారం నైతిక విలువలు అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ, విజేతలైన విద్యార్థులకు మానవతా మెమెం టోలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
సత్యసాయి, అనంతపురం

## జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు : జిల్లా ఎస్పీ పి.జగదీష్

ప్రజా భూమి, అనంతపురం



జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పి.జగదీష్ %ఞూ% పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ రోజులలో సాంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు, పేకాట నిర్వహుకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని ఎస్పీ సూచించారు. కోడీ పందేలు, పేకాట, గుండాట, హెడ్ %ఱ% టైల్ ఇలా ఏ జూద వ్యసనమైనా ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోమన్నారు. కోడి పందేల జూదరులు, కోడి కత్తులు తయారీదారులు పేకాట, నిర్వహకులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. వారిపై గట్టి నిఘా ఉంచామన్నారు. కోడి పందేలు, జూదాల వల్ల ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి పందేలు కాసి డబ్బును నష్టపోతున్నారన్నారు. దీనివలన వారి కుటుంబాలలో పండగ పూట కుటుంబం ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా జిల్లాలో కోడి పందేలు నిర్వహించినా పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత ఇటువంటి కేసులలో ఉంటే వారి యొక్క భవిష్యత్తు అంధకారమవుతుందని ఇతర దేశాలలో ఉద్యోగాల కొరకు వెళ్లే వారికి మరియు ప్రభుత్వ ఉద్యోగాలు పొందే సమయములో, పాస్ పోర్ట్ పొందే సమయాలలో ఈ కేసులు అడ్డంకిగా మారి యువత యొక్క జీవితాలు అధోగతి పాలవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు ఆడినా, జూదం ఆడినా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి లేదా డయల్ 100/112 కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వములో అస్తవ్యస్తంగా మారిన రేషన్ పంపిణీ విధానం

ప్రజాభూమి బ్యూరో, అనంతపురం



ప్రజా సంక్షేమం కొరకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రేషన్ బియ్యాన్ని వాహనముల ద్వారా ప్రజల ఇంటి వద్దకే ఇవ్వడం జరిగిందనీ వైయస్సార్సీపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు భాకే హబీబుల్లా అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రేషన్ పంపిణీ విధానం అస్తవ్యస్తంగా మారింది. జగన్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రేషన్ పంపిణీ వాహనములను పక్కన పెట్టి కొత్తగా రేషన్ షాపులను ఏర్పాటు చేసి రేషన్ ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఈ రేషన్ షాపులు పేద ప్రజల ఇండ్లకు దూరంగా ఉండటంవల్ల ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పేద ప్రజానీకానికి దూరంగా ఉన్న రేషన్ షాపు వద్దకు పోయి అష్టకష్టాలు పడి రేషన్ తెచ్చుకొంటున్నారు. కొన్నిచోట్ల వృద్ధులు, మహిళలు సంచులు పట్టుకొని తమ రేషన్ షాపు ఎక్కడ ఉందో ఎక్కడ రేషన్ వేస్తారో అని సందులు, సందులు తిరగాల్సి వస్తున్నది. అనాలోచితంగా తొందర పాటు నిర్ణయాలతో కూటమి ప్రభుత్వం రేషన్ పంపిణీ విధానం ను మార్చుట ద్వారా మహిళలు, వృద్ధులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా తిరిగి రేషన్ బియ్యం వాహనముల ద్వారా ప్రజల ఇంటి వద్దకే పంపిణీ కొనసాగించాలని ప్రజలు కోరుకొంటున్నారు.

## పోడారాళ్లపల్లికి సంక్రాంతి శోభ

ప్రజాభూమి, ముదిగుబ్బ



ముదిగుబ్బ మండలంలోని పడరాళ్లపల్లికి సంక్రాంతి శోభ అనుకుని పండుగ ముందే వచ్చినట్లుందని ఎంఈఓ రమణప్ప పేర్కొన్నారు శాంతి ఆనంద ఎడ్యుకేషన్ సొసైటీ పొడరాల పల్లిలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించింది ఇందులో 80 మంది పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు ఎంఈఓ రమణప్ప మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో ఉండే సృజనాత్మకతను బయటికి తీయడానికి ఈ ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కష్టపడే గ్రామీణ మహిళలందరూ ఇలా పోటీల్లో పాల్గొనడం అందరికీ సంతోషదాయక మన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. శాంతి ఆనంద ఎడ్యుకేషనల్ డైరెక్టర్ హేల్గాశాంతి, పీటర్, సంస్థ సొసైటీ అధ్యక్షులు చంద్రమోహన్, ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ పోడరాళ్లపల్లి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## తూముకుంట పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూముకుంట పంచాయతీ తూముకుంటలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పంచాయతీ సర్పంచ్ టిఎల్ రత్నమ్మ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు పారిశుద్ధ కార్మికుల ద్వారా పారిశుద్ధ పనులను చేయించారు. తూముకుంట గ్రామంలో పిచ్చి మొక్కల తొలగింపు, ,డ్రైనేజ్ లలో మట్టి తొలగింప,కాలువలు పరిశుభ్రపరచడం, దోమల పిచికారి కార్యక్రమాలను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప ,సర్పంచ్ టిఎల్ రత్నమ్మ పాల్గొన్నారు.

## వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాభూమి, హిందూపురంటౌన్



హిందూపురం వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు దాసా సందేష్, అంతర్జాతీయ డైరెక్టర్ కట్టా అమర్, క్లబ్ మాజీ అధ్యక్షులు రఘునందన్ గుప్తల సమక్షంలో ఎన్నుకున్నారు. సత్య సాయి జిల్లా వాసవీ క్లబ్ హిందూపురం 2025 వ సంవత్సరానికి నూతన అధ్యక్షులు గా ఎం.రాజేంద్ర గుప్తా, కార్యదర్శులుగా దాసా విష్ణు, హెచ్.ఆర్. కిరణ్ తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు టీ.జి. సుబ్రమణ్యం, దాసా గంగాధర్, కె.ఎన్. సూర్యనారాయణ, అధ్యక్షులు ఎం.రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర కరువు బృందం ముందు రైతులు ఏ కరువు

**ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలి**
**తీవ్ర కరువు మండలాల రైతులకు ప్రత్యేక రాయితీలివ్వాలి**
**భూగర్భ జలాలు పెంపొందించాలి**

ప్రజాభూమి, ముదిగుబ్బ

కేంద్ర కరువు బృందం సభ్యులు డాక్టర్ జయంతి, డాక్టర్ పొన్నుస్వామిలు బుధవారం ధర్మవరం డివిజన్లోని ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ముదిగుబ్బ మండలంలోని జొన్నలకొత్తపల్లి గ్రామంలో రైతు బ్రహ్మానందరెడ్డికి చెందిన కంది పంటను, విజయభాస్కరెడ్డికి చెందిన వేరుసెనగ, విశ్వనాథరెడ్డికి చెందిన ఉలవ పంటలను బృందం పరిశీలించింది అనంతరం అక్కడే రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖాముఖి మాట్లాడి సమస్యలను నమోదు చేసుకోవడం జరిగింది. అనంతరం ఈప్రాంతంలో నెలకొన్న సమస్యలపై ఎంపీపీ ఆదినారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ నాయుడు, యాకర్లకుంటపల్లి రైతు గోపాలు, రాళ్ల అనంతపురం నాగిరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి రమేష్ బాబు, జెకేపల్లి రైతు వీరనారపరెడ్డి, రామస్వామి నాయక్ తండాకు చెందిన మహిళ రైతు లక్ష్మీబాయి, సంకేపల్లికి చెందిన ఇంటూరు పురుషోత్తమనాయుడు ముదిగుబ్బ చెందిన తుమ్మలసూరిలు తెలియపరిచారు. అదేవిధంగా ధర్మవరం ఆర్డీవో మహేష్ కేంద్ర బృందానికి డివిజన్ వ్యాప్తంగా 10 మండలాల పరిస్థితి వివరిస్తూ తీవ్ర కరువు మండలాలైన ముదిగుబ్బ, తాడిమర్రి మండలాలు ఎదుర్కొంటున్న దుర్భిక్షన్ని బృందానికి వివరించారు.



తీవ్ర కరువు మండలాల ప్రజల విజ్ఞప్తులు...



ముదిగుబ్బను తీవ్ర కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిన ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు మాత్రం గడిచిన మాసంలో ఒక్కరోజు ఒక కూలీకి పని కల్పించలేదని గోకులం షెడ్లు 45 మంజూరు కాక ఒక్కరికి కేటాయించలేదని పేర్కొంటూ ఉన్నతాధికారులతోనైనా కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవడం తోపాటు వ్యవసాయానికి అనుసంధానం చేస్తూ ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. ఏడాది ఏడాదికి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, హంద్రీనీవా జలాలతో యోగివేమన జలాశయంతోపాటు (వైవిఆర్ ప్రాజెక్ట్) మండలంలోని అన్ని చెరువులను నింపాలని తద్వారా భూగర్భజలాల పెరిగే అవకాశముందని తెలిపారు. ముదిగుబ్బలో దశాబ్దాలు తరబడి 10 రోజులకోకసారి నీటిసరఫరా అవుతొందని వైవిఆర్ ప్రాజెక్టు నీటిని శుద్ధి చేసి సరఫరా చేసేలా ప్రభుత్వానికి సూచించాలని కోరారు. తీవ్ర కరువు మండలమైన ముదిగుబ్బ మండల రైతులకు అన్ని రంగాల్లో రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పంటల రుణాల వడ్డీని మాఫీ చేయాలని, మరిన్ని గోకులం షెడ్లు మంజూరు చేసి పాడి రైతులను ఆదుకోవాలని వినతులిచ్చి విజ్ఞప్తులు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వైవి సుబ్బారావు, జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా ప్రణాళికాధికారి, జిల్లా పట్టు పరిశ్రమాధికారి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ, కదిరి ఏ డి ఏ సత్యనారాయణ, తలుపుల మండల వ్యవసాయాధికారి షాదాబ్, ముదిగుబ్బ ఏవో లక్ష్మీ నరసింహులు, మండల కన్వీనర్ ప్రభాకర్ రాష్ట్ర అగ్రికల్చర్ రేచర్చ్ కో కన్వీనర్ సోమలప్రకాష్, కొలసాని చంద్ర, గొర్తి నందా, భాషా, జానీ, పీరా మండలంలోని వివిధ గ్రామాలరైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

# రౌడీలను ప్రోత్సహిస్తున్న రాజకీయ పార్టీలు!గత పాలకుల త్యాగాలు బుగ్గిపాలు!

**-ఆంధ్రప్రభ బ్యూరోపై దాడి రాజకీయ పార్టీలకు,పోలీసు వ్యవస్థకు సవాల్! అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కేవీ రమణ**

ప్రజా భూమి బ్యూరో, అనంతపురం



ఆంధ్రప్రభ బ్యూరోపై దాడి రాజకీయ పార్టీలకు పోలీసు వ్యవస్థకు సవాల్గా మారిందని అభివృద్ధి కేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కెవి రమణ అన్నారు. విలువలు, విశ్వసనీయత, నీతి, నిజాయితీ, సేవా భావం, ప్రజలతో సత్సంబంధాలు, ప్రాంతాల పట్ల అవగాహన ఒకప్పటి రాజకీయపార్టీలకు, నాయకులకు అర్హతలు. అందుకే నాడు తరిమెల నాగిరెడ్డి, కల్లూరు సుబ్బారావు లాంటి పేర్లు నవినబడేవి. నేడు అవి లేకపోవడమే అర్హత, అంతే కాకుండా బరితెగించి ఎవరైతే కరుడుగట్టిన నేరస్తులు ఉన్నారో వారు మాత్రమే మా పార్టీలో చేరండి, వారికే ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇస్తామని ప్రకటిస్తున్న నేపథ్యం, అందుకే మంచిగా చెప్పుకోవడానికి ఒక్క పేరు కూడా వినబడదు, కనపడదు. అయినా ఏ వ్యవస్థ స్పందించదు, ఎవరికీ కాబట్టదు. 1980- 90 మధ్యకాలంలో అనంతపురం పట్టణాన్ని రౌడీలు శాసించారు. ఆనాడు బలమైన ప్రజాసంఘాలు, నిజాయితీవరులైన పోలీసు అధికారులు ఉన్న కారణంగా వారి బారి నుండి పట్టణాన్ని కాపాడుకోగలిగారు. నేడు మరలా పట్టణంలో అలాంటి వరిస్థితులే పొడచూస్తున్నాయి. ఎదుర్కోవడానికి నేడు బలమైన ప్రజా సంఘాలు లేవు, నీతివంతమైన పోలీసు అధికారులు కానరావడం లేదు, ఇక రాజకీయ పార్టీల అజెండాలు, మారిపోయినాయి ఈ పరిస్థి తులలో అనంతపురం పట్టణాన్ని ఎవరు కాపాడుతారా! అని ఎదురుచూస్తున్నారు.

నిత్యం పట్టణంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు తెల్లారేలోగా ప్రజల ముంగిటికి చేరుస్తున్న పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకే రక్షణ లేని పరిస్థితులు దాపురించాయి, ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు తప్పులు చేసి, వారి తప్పులను ఎత్తి చూపుతున్న విలేకరులను చంపుతామని బెదిరించినా పట్టించుకునే దిక్కులేదు, వారి ఇళ్లకు, వాహనాలకు రక్షణ లేదు. సంబంధిత పోలీసులు కేసు పెట్టకపోగా, కంప్లైంట్ కూడా తీసుకోని పరిస్థితి.

నిన్న ఆంధ్రప్రభ బ్యూరోపై జరిగిన ఘటనను ఒక పత్రికా ప్రతినిధికి జరిగిన సంఘటనగా భావించడానికి వీలులేదు, ఇది ఒక రకంగా రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు సవాల్. మేము ఎన్ని అక్రమాలు, దౌర్జన్యాలు, దాడులు చేసినా ప్రశ్నించకూడదనే హెచ్చరిక. అందుకే అనంతపురం పట్టణంలో గల అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ఏకమై , ఇలాంటి అరాచక శక్తులను ప్రాథమిక దశలోనే పీక పిసకడానికి కార్యాచరణ రూపొందించాలి. పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండి మొక్కదశలోనే మోదు వారేటట్టు చేయాలి. అప్పుడే అనంతపురం పట్టణంలో ప్రశాంతత, అభివృద్ధికి అవకాశం, గత దివంగత పాలక త్యాగమూర్తుల ఆత్మకు శాంతి, లేకుంటే పట్టణం రౌడీల మయమై పోతుంది. అప్పుడు రాజకీయ పార్టీలు ప్రజల ముందు దోషులుగా నిలబడక తప్పదు.

## వసతి గృహానికి డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేయాలి

**-ఏఐడీఎస్ఓ నిరసన**
ప్రజాభూమి, హిందూపురం టౌన్




పరిగి మండలం సేవామందిరం బాలుర వసతి గృహానికి వెంటనే డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఏఐడీఎస్ఓ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐడీఎస్ఓ సంఘం నాయకులు బాలుర వసతి గృహాన్ని సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందని ఆందో ళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇరుకు గదులలోనే ఇబ్బందులకు గురవుతూ కాలం వెలబుచుతున్నారని వాపోయారు. విద్యార్థులకు నూతన భవనాన్ని నిర్మించాలని, అదే విధంగా హాస్టల్ కు సరైనటువంటి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో డ్రైనేజీ వ్యర్థాలు సరిగా ప్రవహించక చుట్టు ప్రక్కన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైనేజీ సమస్య కారణం వల్ల విద్యార్థులు బహిర్భూమి కోసం ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకుందన్నారు. వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని బి. సి. సంక్షేమ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు నాయకులు మహేష్ బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఫోన్ లో సంప్రదించగా వారం రోజులలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకోని వెళ్తామని రాష్ట్ర కార్యదర్శి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఏఐడీఎస్ఓ నాయకురాలు పూజిత తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు -తహసిల్దార్ విజయ కుమారి

ప్రజాభూమి, రాప్తాడు :




భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తాసిల్దార్ విజయకుమారి అన్నారు . బుధవారం మండల పరిధిలోని గాండ్లపర్తి గ్రామంలో వీఆర్వో చక్రధర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు ఈ సందర్భంగా తాసిల్దార్ విజయ కుమారి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ రెవెన్యూ సదస్సు చక్కని వేదిక అని రైతులందరూ రూపంలో సమస్యలను వివరించాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో రి సర్వే జరిగిన తర్వాత సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని గ్రామస్తులకు రైతులకు హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరేష్,సి ఎస్ డి టి జ్యోతి ,ఆర్ఐ కరుణాకర్, రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయండి

## -ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

ప్రజాభూమి, రాప్తాడు :




ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి , జడ్పిటిసి పసుపుల హేమావతి అన్నారు . బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు,ప్రజాప్రతినిధులకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు త్రాగునీరు పారిశుద్ధ్యం విద్య వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ప్రజాప్రతినిధులకు ఆమె సూచించారు .అన్ని శాఖల అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు అదేవిధంగా చేయాల్సిన పనులను ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు సేకరించారు. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని రాప్తాడు సర్పంచ్ ప్రశ్నించారు . ఇంక మీదట ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు నాడు నేడు పనులపై పూర్తిగా నివేదికలు అందించాలని ఎంపిటిసి జాఫర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వరలక్ష్మి సర్పంచులు సీనయ్య, ఎంపీటీసీ రవి ,సర్పంచ్ శశికళ, ఉజ్జినప్ప అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

v Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Mohaneeswar Publications, D.No. 59-2-1,Ashoknagar 1st lane.Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh and Published from D.NO. 59-2-1,Ashoknagar1st lane,Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677